'సోమశిల'లో 68.537 టీఎంసీల నిల్వ

అనంతసాగరం జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 1,866 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 68.537 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.






- వచ్చే నెల 1 నుంచి 3 రోజులపాటు సభలు
- కవాతుతో ఎరుపెక్కిన నెల్లూరు నగరం

సీపీఎం రాష్ట్ర మహాసభల
నగారా

నెల్లూరు (వైద్యం) జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 1వ తేదీ నుంచి మూడు రోజులపాటు నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు నగారా మోగించారు. శుక్రవారం నగరంలోని వీఆర్‌సీ క్రీడా మైదానంలో డప్పు వాయించి మహాసభల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఎరుపు రంగు చొక్కాలు ధరించిన వలంటీర్ల వందనాన్ని స్వీకరించారు. అనంతరం నగరంలోని ప్రధాన కేంద్రాలలో ఎర్రదండు ప్రదర్శనతో ఆయా ప్రాంతాలు ఎరుపుమయం అయ్యాయి. సీపీఎం నేతలతోపాటు కార్యకర్తలు కూడా ఎర్ర దుస్తులు ధరించి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అనేక ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిన సింహపురి గడ్డపై నుంచే భవిష్యత్తు పోరాటాలకు మహాసభలలో రూపకల్పన చేస్తామన్నారు. ఈ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభల ముగింపు రోజు 3వ తేదీన నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించి, వీఆర్‌సీ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు రమాదేవి, మూలం రమేష్, కత్తి శ్రీనివాసులుమోహన్‌రావ్, అజయ్‌కుమార్, గోపాల్, నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్సీ మైదానంలో డప్పు వాయిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



ఉదయగిరి : రంగనాయకులస్వామి ఆలయ ముఖద్వారం

పర్యాటకం... ప్రతిపాదనల్లోనే!

నీటిమూటలవుతున్న పాలకుల హామీలు

● నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

పచ్చని చెట్ల మధ్య ఎత్తయిన కొండలు.. వాటినుంచి పాలవెల్లువలా జాలువారే సెలయేళ్లు ఓ వైపు... ఎంత పెద్దవారైనా పిల్లోడిలా మార్చేసే కడలితీరం మరోవైపు... భక్తిభావం పెంపొందించే ప్రముఖ ఆలయాలు.. ఆహ్లాదం పంచుతూ చల్లని గాలులు వీచే జలాశయాల ప్రాంతాలు, ఉద్యానవనాలు అబ్బో.. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో పర్యాటక ప్రాంతాలు చాలానే ఉన్నాయి. ఉరుకులు పరుగుల ప్రపంచంలో మానసిక ఉల్లాసం కోసం నగరం, పట్టణవాసులు సెలవు రోజుల్లో ఈ ప్రాంతాలకే తరలిపోతుంటారు. అయితే, అలా వెళ్లిన వారిని అక్కడి పరిస్థితులు వెక్కిరిస్తున్నాయి. ఇంటిల్లిపాది కాసేపు గడిపేందుకు కనీస వసతులు కరువవుతున్నాయి. కనీసం సేదతీరే సౌకర్యం లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం అధికారులు చేస్తున్న ప్రతిపాదనలు కాగితాల్లోనే ఉండిపోతున్నాయి. ఇచ్చిన హామీలను కూడా నాయకులు విస్మరిస్తున్నారు. గత వైసీపీ హయాంలో మరింత కునారిల్లిన పర్యాటక రంగం ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ప్రగతి బాట పట్టేనా!? పర్యావరణప్రియులు ఆశగా ఎదురుచూస్తున్నారు. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల స్థితిగతులపై ఆంధ్రజ్యోతి సంక్షిప్త కథనం...

- వివరాలు 6లో..



అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

పకడ్బందీగా గణతంత్ర దినోత్సవం

● విస్తృత ఏర్పాట్లు చేయండి : జేసీ

నెల్లూరు (హరనాథపురం) జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న గణతంత్ర

- వివరాలు 6లో

ఓటు వజ్రాయుధం

- ఓటుతోనే పాలకుల ఎన్నిక
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఓటు వజ్రాయుధం వంటిది. మంచి పాలకులను ఎన్నుకోవడానికి ఆ ఆయుధం పనిచేస్తుంది. 1950లో భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైంది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. 2011 నుంచి ఈ వేడుకలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. యువత రాజకీయ కార్యకలాపాలలో నిమగ్నం అయ్యేలా చూడాలనేదే జాతీయ ఓటరు దినోత్సవ లక్ష్యం. ప్రజా సమస్యల పరిష్కారానికి మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడానికి ఓటు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఓటరు దినోత్సవం సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓటు విలువను తెలియచేసి, ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం బహుమతులు అందచేస్తారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది, కాగా, జిల్లాలో 19,44,664 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలదే ఆధిక్యం. గతేడాది ఎన్నికల సమయంలో విడుదల చేసిన ఓటర్ల జాబితాతో పోల్చితే ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో 1.17 లక్షల మంది ఓటర్లు తగ్గారు. నాడు 20,61,822 మంది ఓటర్లు ఉండగా ఈ సంవత్సరం విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం 1944664 మందే ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	113081	115591	26	228698
కావలి	117540	122091	28	239659
ఆత్మకూరు	105718	109542	06	215266
కోవూరు	128642	138161	25	266828
నెల్లూరునగరం	116590	122603	67	239260
నెల్లూరురూరల్	136816	144454	21	281291
సర్వేపల్లి	112863	119257	26	232146
మొత్తం	951145	993309	210	1944664



కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో మద్యం షాపులు కేటాయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గీత ఉపకులాలకు 'లక్కీ' షాపులు

● మద్యం దుకాణాలు కేటాయించిన కలెక్టర్

నెల్లూరు (క్రైం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గీత కులాల సంక్షేమార్థం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన 18 మద్యం దుకాణాలను లక్కీడిప్ ద్వారా ఉపకులాలకు కేటాయించారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ఆనంద్ ఆధ్వర్యంలో కల్లు గీత కార్మికుల సంక్షేమ సమితి నాయకుల పరిశీలనలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లాటరీ విధానం ద్వారా గమళ్ల కులానికి 4, గౌండ్లకు 1, గౌడకు, గౌడ్‌కు 6 షాపులను కేటాయించినట్లు తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం షాపుల ఏర్పాటుకు ఆయా ఉపకులాలలోని ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. షాపుల లైసెన్స్ ఫీజులో వారికి 50 శాతం రాయితీ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతం	ఉపకులం
నెల్లూరు	గమళ్ల
కావలి	గమళ్ల
కందుకూరు	గౌడ్
ఆత్మకూరు	గౌడ
కందుకూరు రూరల్	గౌడ్
కలువాయి	గౌడ
లింగసముద్రం	గౌడ్
దగదరి	గౌడ
ఏఎస్‌పేట	గౌడ
కావలి రూరల్	గౌండ్ల
గుడ్లూరు	గమళ్ల
ఆత్మకూరు	గమళ్ల
జలదంకి	గౌడ
సంగం	గౌడ్
కలిగిరి	గౌడ్
అనంతసాగరం	గౌడ్
వింజమూరు	గౌడ
దుత్తలూరు	గౌడ

కాటేపల్లి పంచాయతీ కార్యదర్శి
విధుల నుంచి తొలగింపు

వింజమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాటేపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమారిని విధులు నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్త ర్వులు జారీ చేశారు. పంచాయతీలో రికార్డులు, సమావేశాలు సరిగా నిర్వహించకపోవడం, పంచా యతీ తీర్మానాలు అమలుపరచకపోవడం, సీఎఫ్ ఎంఎస్ నిబంధనల మేరకు నిధులు చెల్లింపు, ఇంటి పన్ను వసూళ్లను దుర్వినియోగం చేయడం, కంపచెట్లను పంచాయతీ ఆదాయానికి నష్టం చేకూర్చడం, విధులను విస్మరించడం తదితర కారణాలతో ఆమెపై వేటు పడింది. అదేవిధంగా సాధారణ నిధులతో పాటు 14, 15వ ఆర్థిక సం ఘాల నిధుల నుంచి డ్రాచేసిన మొత్తం రూ.46,85,894 సంబం దించిన రికార్డులను పొందుపరచ నందున చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల కొనుగోలు పేరుతో అక్రమాలు

పేదల మాటున బడా దోపిడీ!

- నిబంధనలకు మించి పరిహారాలు చెల్లింపు
- నివాసయోగ్యం కాని భూములకు కూడా అధిక ధరలు
- నాడు వైసీపీ నేతలపై వెల్లువెత్తిన ఆరోపణలు
- ఇప్పుడు విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలన

ఇందుకూరుపేట మండలంలోని ఓ గ్రామంలో 3.79 ఎకరాలను 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద భూసేకరణ చేయాలని నిర్ణయించారు. వాస్తవానికి అక్కడ ఓ ఎకరా విలువ రూ.5.15 లక్షలు. భూసేకరణ నిబంధనల ప్రకారం 1.25 రెట్లు పెంచేందుకు అవకాశముంది. దీంతో ఎకరం విలువ రూ.6.44 లక్షలు ఉండాలి. దీనికి వంద శాతం సొల్యూషన్ కలుపుకునేందుకు కూడా వీలు కల్పించారు. ఈ లెక్కన చూసుకుంటే ఒక ఎకరానికి రూ.12.96 లక్షలు మాత్రమే పరిహారం చెల్లించాలి. కానీ ఇక్కడ మాత్రం భూ యజమాని అడిగారన్న కారణంతో ఎకరం విలువను ఏకంగా రూ.23 లక్షలకు పెంచారు. ఇలా మొత్తంగా 3.79 ఎకరాలకు రూ.49.11 లక్షలను పరిహారం కింద చెల్లించాల్సి ఉండగా అందుకు రెట్టింపు అంటే రూ.87.17 లక్షలను చెల్లించారు.

టీపీ గూడూరు మండలంలోని మరో గ్రామంలో 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద 1.58 ఎకరాలను సేకరించారు. ఇక్కడ ఎకరం బేసిక్ వ్యాల్యూ రూ.6 లక్షలుగా ఉంది. నిబంధనల ప్రకారం 1.25 రెట్లు పెంచితే ఎకరం విలువ రూ.7.5 లక్షలుగా ఉంటుంది. దీనికి వంద శాతం సొల్యూషన్ కలుపుకున్నా ఎకరం విలువ రూ.15 లక్షలు మాత్రమే అవుతుంది. మొత్తం 1.58 ఎకరాలకు నిబంధనల ప్రకారం రూ.23.82 లక్షలు పరిహారం కింద చెల్లించాల్సి ఉండగా అందుకు భిన్నంగా రూ.34.76 లక్షలు చెల్లించారు. నెగోషియేషన్ పేరుతో అధికారులు ఎకరం వ్యాల్యూను రూ.15 లక్షల నుంచి రూ.22 లక్షలకు పెంచారు.

ఇవే కాదు... ఇటువంటి చిత్ర విచిత్రాలు జిల్లాలో అనేకం ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాల పేరుతో భారీగా అవినీతి జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా భారీ ధరలు ఖరారు చేసి నాడు దోచిపెట్టారన్న ప్రచారం జరిగింది. నివాస యోగ్యం కాని భూములను కూడా అధిక ధరలతో కొనుగోలు చేశారన్న ఫిర్యాదులు న్నాయి. అప్పట్లోనే ఎన్ని ఆరోపణలు వచ్చినా నాడు పట్టించుకున్న వారు లేరు. పేదల ఇళ్ల సంగతేమో గానీ వైసీపీ నేతలు మాత్రం అవినీతి సంపాదనతో భారీ భవంతులే కట్టుకున్నారన్న ఆరోపణలున్నాయి.

జిల్లాలో 1,109 లేఅవుట్లు వేయగా అందులో సుమారు 150 లేఅవుట్లకు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూమిని కొనుగోలు చేశారు. ఇందుకు రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించారు. ఈ కొనుగోలుకు ప్రభుత్వం కొన్ని విధివిధానాలు రూపొందించింది. కానీ చాలా చోట్ల అవేవీ పాటించలేదని ఆ లేఅవుట్లను చూస్తేనే అర్థమవుతోంది. భూసేకరణ నిబంధనల ప్రకారం బేసిక్ వ్యాల్యూ కన్నా 1.25 రెట్లు అధికంగా చెల్లించవచ్చు. ఈ మొత్తానికి వంద శాతం సొల్యూషన్ కూడా కలుపుకోవచ్చు. అంతకుమించి చెల్లించేందుకు నిబంధనలు ఒప్పుకోవు. కానీ చాలా చోట్ల ఈ మొత్తాని కన్నా రెట్టింపు ధరను ఖరారు చేసి ప్రజాధనాన్ని దోచిపెట్టారు. తహసీల్దార్ నుంచి కలెక్టర్ స్థాయి వరకూ ప్రతి ఒక్కరూ ఇందులో పాత్రధారులుగా ఉన్నారు. కావలి మండలంలో భూసేకరణ విషయంలో భారీ ధరను పరిహారంగా చెల్లించాలని వైసీపీ నేతలు పట్టుబట్టగా నాటి కలెక్టర్ ఎంవీ శేషగిరిబాబు ఒప్పుకోలేదని, ఆయన బదిలీకి ఇదే ప్రధాన కారణమని నాడు ప్రచారం కూడా జరగడం గమనార్హం.

విజిలెన్స్ విచారణ ప్రారంభం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్లపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో అనేక చోట్ల నివాసానికి పనికి రాని లేఅవుట్లను వేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఈ లేఅవుట్లకు అవసరమైన భూమి కొనుగోలు దగ్గర నుంచి ఆ భూమిని చదును చేయడం వరకూ అవినీతి జరిగిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. లేఅవుట్ల లెవలింగ్‌పై డ్వామా క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఓ వైపు విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలోనే భూమి కొనుగోళ్లపై విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. పేదలందరికీ ఇళ్లు పథకం కింద కొనుగోలు చేసిన భూముల వివరాలన్నింటినీ సేకరించింది. రికార్డుల ప్రకారం అన్ని వివరాలను సరిచూసుకున్న విజిలెన్స్ అధికారులు.. ఇప్పుడు క్షేత్రస్థాయి విచారణకు దిగారు. గడిచిన రెండు రోజులుగా విస్తృతంగా లేఅవుట్లను పరిశీలిస్తున్నారు. సగానికిపైగా లేఅవుట్ల పరిశీలన పూర్తయినట్లు సమాచారం. చాలా లేఅవుట్లలో అక్రమాలు గుర్తించినట్లు తెలుస్తోంది. త్వరలోనే విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు. ఈ నేపథ్యంలో భూమి కొనుగోళ్లలో ఎన్ని రూ.కోట్ల మేర అక్రమాలు జరిగాయి..? ఇందుకు ఎవరెవరు బాధ్యత వహించాల్సి ఉంటుంది? అన్నది ఆసక్తిగా మారింది.



- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

సర్వేపల్లిలో
వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్

- 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం
- రూ.20 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచిన నెడ్‌క్యాప్
- ఇప్పటికే సర్వేపల్లిలో 15 ఎకరాల సేకరణ
- నెల్లూరు చెత్తంతా ఇక ఆ ప్లాంట్‌కే
- తక్కువ ధరకే కార్పొరేషన్‌కు విద్యుత్ సరఫరా

నెల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎప్పటి నుంచో ప్రతిపాదనల దశలో ఉన్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణంలో అడుగులు ముందుకు పడ్డాయి. చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌ను నెలకొల్పేందుకు నెల్లూరులో నెడ్‌క్యాప్ సిద్ధమైంది. రూ20 కోట్ల అంచనాతో ఈ ప్లాంట్ ఏర్పాటుకు ఆ సంస్థ టెండర్లు ఆహ్వానించింది. ప్రతి రోజూ 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంటు నిర్మాణం చేపట్టనుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. ఇప్పటికే గుంటూరు, విశాఖ నగరాల్లో ఈ ప్లాంట్‌ను నిర్మించి విజయవంతంగా చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా ఇప్పుడు మూడో ప్లాంట్‌ను నెల్లూరులో నిర్మిస్తుండడం విశేషం. గతంలోనే ఈ ప్లాంట్ నిర్మాణానికి సర్వేపల్లిలో 15 ఎకరాల భూమిని గుర్తించారు. వచ్చే నెల 6వ తేదీతో టెండర్ల దాఖలుకు గడువు ముగుస్తుంది. ముందుకొచ్చే ఆసక్తి కలిగిన సంస్థల్లో ఒక సంస్థను ఎంపిక చేసి నెల్లూరు ప్లాంట్ బాధ్యతలను అప్పగిస్తారు. ప్రస్తుతం నెల్లూరులో రోజుకు 300 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, దొంతాలి డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తున్నారు. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే ఇక నగరంలో వచ్చే చెత్తను అక్కడకు తరలిస్తారు. ఆ చెత్తను ప్రాసెసింగ్ చేసి దాని నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. దీంతో నెల్లూరు కార్పొరేషన్‌కు చెత్త డంపింగ్ చేసే సమస్య తప్పుతుంది. ఇక ప్లాంట్‌లో తయారయ్యే విద్యుత్‌ను కార్పొరేషన్‌కే తక్కువ ధరకు విక్రయిస్తారు. ఇక్కడ సరిపోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. విద్యుత్ తయారీ క్రమంలో వచ్చే యాష్ బయటకు వచ్చి పొల్యూషన్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ యాష్‌తో బ్రిక్స్‌ను తయారు చేస్తూ మరో వ్యాపారం చేస్తున్నారు. ప్లాంట్ మొత్తం గ్రీనరీగా తయారు చేస్తున్నారు. కాగా ఈ ప్లాంట్ ఏర్పాటుపై నెడ్ క్యాప్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డిని సంప్రదించగా నెల్లూరులో ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి హెడ్ ఆఫీస్ నుంచి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఈ ప్లాంట్ ఏర్పాటుతో నెల్లూరులో చెత్త డంపింగ్ సమస్య తీరుతుందని, తక్కువ ధరకే కార్పొరేషన్‌కు విద్యుత్‌ను అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.



ప్రమాదమని తెలిసినా...!

ఎంత హడావిడి జీవితమైనా, ఎన్ని అర్జెంటు పనులున్నా ప్రమాదాలకు ఎదురెళ్ల కూడదు. కానీ కొందరు తొందరగా వెళ్లాలన్న ఆతృతలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నెల్లూరులోని సౌత్ రైల్వే స్టేషన్ వద్ద నిత్యం ఎంతో మంది ప్రమాదకరంగా రైలు పట్టాలు దాటుతున్నారు. రైలు ఎక్కాలన్న తొందర కొందరిదైతే... రైలు ఆగితే కాసేపు పట్టాలు దాటలేమన్న అసహనం మరికొందరిది.



ఇంకొందరు రైలు వస్తుండగా కొన్ని సెకన్ల ముందు ట్రాక్ మీద నుంచి పరుగులు తీస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే కుటుంబం జీవితాంతం కన్నీరు పెట్టాల్సి వస్తుందని ఒక్క క్షణం ఆలోచిస్తే ఇలాంటి సాహసాలు చేయరు. రైలు రావడానికి ముందే స్టేషన్‌కు చేరుకోవడం, రైలు ఆగినా రెండు నిమిషాలే కదా అని ఓపిక పట్టి ఆ తర్వాత పట్టాలు దాటడం శ్రేయస్కరం అని గుర్తించాలి. మిత్రులారా.. బీ కేర్‌ఫుల్!

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్






జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి నోచుకోనంటోంది. రాజకీయ నాయకులు ఎన్నికల్లో ఇస్తున్న హామీలు ఆ తర్వాత అమలుకు నోచుకోవడం లేదు. పైగా చేసిన ప్రతిపాదనలు కూడా కాగితాల్లోనే ఉండిపోతున్నాయి. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలపై సంక్షిప్త సమాచారంతో ప్రత్యేక కథనం...



మైపాడు తీరంలో ఉల్లాసంగా గడుపుతున్న ప్రజలు

ప్రతిపాదనల్లోనే పర్యాటకం!

- అభివృద్ధికి నోచుకోనంటున్న వైనం
- నీటిమూటలవుతున్న పాలకుల హామీలు
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



ఎన్నికల అస్త్రంగా దుర్గం

ఉదయగిరి : మనసు రంజింపచేసే ప్రకృతి శోభ కలిగిన ఉదయగిరి దుర్గంపై దట్టమైన అడవులు, కొండలు అందులో నుంచి ప్రవహించే జలపాతాలు, సేలయేళ్లు చూడముచ్చటగా ఉంటాయి. ఎందరో రాజులు, నవాబులు, బ్రిటీషు పరిపాలనకు కేంద్రంగా విరాజిల్లిన పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణం. ప్రతిసారి ఎన్నికల సమయంలో ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పిన నేతల మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. దుర్గం అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలు కాగితాల్లోనే ఉండిపోయాయి. దీంతో నానాటికీ శిథిలమవుతున్న అలనాటి చారిత్రక గుర్తులు భావితరాల వారు పుస్తకాల్లో చదివి చెప్పుకోవాల్సిన దుస్థితి నెలకొంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

దశాబ్దాలుగా ఉదయగిరి దుర్గం ఎన్నికల్లో నేతలకు అస్త్రంగానే మారింది. 1989లో అప్పటి ఎమ్మెల్యే మాదాల జానకీరామ్ కేంద్రమంత్రి జగదీష్ టైట్లర్‌ను దుర్గం సందర్శనకు తీసుకెళ్లి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. అప్పట్లో తొలివిడత రూ.2.16 కోట్లు మంజూరు చేశారు. మొదటి దశ నిధుల్లో రూ.40 లక్షలతో ఉదయగిరి నుంచి వల్లభరాయుని ఆలయం వరకు తారు రోడ్డు నిర్మించారు. వల్లభరాయుని దేవస్థానాన్ని అయ్యప్ప ఆలయంగా మార్చారు. దుర్గంపై అతిథిగృహ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అనంతరం జరిగిన పరిణామాల్లో నిధులు వేరే పనులకు మళ్లించారు. 2010లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉదయగిరి ఆనకట్ట సమీపంలో సుమారు రూ.10 లక్షలతో చేపట్టిన అతిథిగృహం, హోటళ్ల నిర్వహణ కోసం నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు అధికారులతో కలిసి దుర్గాన్ని సందర్శించి, ఎలాంటి అభివృద్ధి చేయవచ్చో టూరిజం శాఖ అధికారులతో చర్చించారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపారు. ఈ ప్రతిపాదనలు సైతం కాగితాలకే పరిమితమయ్యాయి. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా దుర్గం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందా అని ఈ ప్రాంత ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

'వేదగిరి'కి 'ప్రసాద్' హంగులు

నెల్లూరు రూరల్ : పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం పర్యాటక హంగులు దిద్దుకోనున్నది. కేంద్ర పర్యాటక శాఖ 'ప్రసాదం' పథకం ద్వారా రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో రూ.18 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసిన అధికారులు ఆ దస్త్రాలను న్యూఢిల్లీకి చేర్చారు. తుది పరిశీలనకు అక్కడ నుంచి ప్రత్యేక బృందం వేదగిరిని పరిశీలించేందుకు త్వరలో రానున్నది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు మొదలుపెట్టేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దేవరపాళెం నుంచి ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంపైన రేకులతో పైకప్పు, లైటింగ్, మెట్లు ఆధునీకరణ వంటి పనులు చేపట్టనున్నారు. ఆలయంలో భక్తులు రాత్రివేళ సేదతీరేందుకు వీలుగా డార్మెంటరీ నిర్మించనున్నారు. ఏడు కోనేళ్ల ఆధునీకరించడంతోపాటు కొండపైనున్న స్వామి వారి దశావతారాలపై కప్పు, పార్కులను ఏర్పాటు చేయనున్నారు. పార్కింగ్ ప్రాంతాలు, పర్యటక భవనం ఆధునీకరణతోపాటు ఆలయంలోని అర్చకులకు కాటేజీలను నిర్మించను న్నారు. అంతేగాక దేవస్థానం కార్యాలయ భవనం, ఆలయం చుట్టూ ప్రహరీని నిర్మించనున్నారు. కొండ కింద టోల్‌గేట్ నుంచి పైన ఆలయం వరకు లైటింగ్, ఏడు కోనేళ్ల వద్దనున్న గోవిందరాజుల స్వామి ఆలయ ప్రహరీ ఆధునీకరణ, స్వామి ఆలయంలో అంతర్గత పనులు చేపట్టనున్నారు.



వేదగిరి క్షేత్రం వ్యూ



మైపాడు బీచ్‌లో...

ఇందుకూరుపేట : నెల్లూరుకు 22 కి.మీ దూరంలో ఉన్న మైపాడు బీచ్ సందర్శకులను ఆకర్షిస్తోంది. కానీ ఆ స్థాయిలో ఇక్కడ వసతులు కరువయ్యాయి. ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపుల ఎటు చూసినా పచ్చని పొలాలు, కొబ్బరి చెట్లు, అరటి తోటలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. వీటిని దాటుకుని ముందుకెళితే ఎగిసిపడే అలల సవ్వడులు, మధ్యలో ఆధ్యాత్మికత పరిడవిల్లే జ్యోతిర్లింగాల క్షేత్రం ఉంది. అటు ఆహ్లాదం.. ఇటు ఆధ్యాత్మికత ఉట్టిపడే మైపాడు బీచ్ అలసిన మనసులను మైమరిపిస్తోంది. దీంతో జిల్లా వాసులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తుంటారు. ఈ తీరంలో కొలువైన ద్వాదశ జ్యోతిర్లింగాలయం దేశాన్ని చుట్టి వచ్చిన అనుభూతులను కల్పిస్తోంది. పళని సుబ్రహ్మణ్యంస్వామి, వల్లిదేవసేన సమేత సూర్యచంద్ర పార్వతీ దుర్గాదేవిలు ఈ సాగరతీరంలోని ఒకే ఆలయంలో కొలువై ఉంది. ఆలయ ప్రాంగణంలో ఎత్తైన మహా శివలింగం తన్మయత్వం చెందేలా చేస్తోంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగి మైపాడు సముద్రతీరంలో పర్యాటకుల కోసం ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు నిర్మించిన రిసార్ట్ పూర్తిగా శిథిల వ్యవస్థలోకి చేరాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రిసార్ట్ గురించి పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మైపాడు బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.



ఎర్త్‌డ్యాంపై బోసిపోయిన పచ్చదనం

సోమశిల కళావిహీనం

కూటమి ప్రభుత్వంపై ఆశలు

అనంతసాగరం : పర్యాటక రంగానికి ఎంతో ఊతమిచ్చే సోమశిల జలాశయం పాలకుల అనాలోచిత నిర్ణయాలతో కునారిల్లుతోంది. అభివృద్ధి మాట అటుంచితే కనీసం ఉన్నవాటిని కాపాడుకోలేని దైన్యస్థితి ఇక్కడ నెలకొంది. 1975లో నిర్మితమైన సోమశిల జలాశయం పదేళ్ల తర్వాత నీటి నిల్వ ప్రక్రియ, ఆయకట్టు అభివృద్ధి చర్యలు అందుబాటులోకి రావడంతో 1985లో జాతికి అంకితం చేస్తున్నట్లు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సోమశిలలో పైలాన్ ఆవిష్కరించారు. అప్పట్లో టీడీపీ హయాంలోనే అభివృద్ధికి అంకురార్పణ జరిగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వం కూడా సోమశిల రూపురేఖలు మార్చిన దాఖలాలు లేవు. జలాశయం దిగువ ప్రముఖ పుణ్యక్షేత్రం సోమశ్వరాలయం ఉంది. 2013లో రూ.2.79 కోట్లతో పర్యాటక పనులు అందుబాటులోకి తెచ్చారు. ఆరు పర్ణశాలలు, డార్మెంటరీ, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే, వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో సోమశిలకు వచ్చిన సందర్శకులు విడిది చేసే అవకాశం లేక వెనుతిరుగుతున్నారు. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన సోమశిల ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధి చెందుతుందన్న ఆశ స్థానికుల్లో నెలకొంది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కూడా సోమశిలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఎకోటూరిజంకు బాటలు వేస్తామని ఇటీవల ప్రకటించారు. ఆ దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అందమైన పార్కులు, రిసార్ట్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండగా స్థానికుల ఉపాధి అవకాశాలు లభ్యం కానున్నాయి. ఇక బోటు షికారు వల్ల నెల్లూరు టూ కడప ప్రయాణం తగ్గుతుంది. నీటి అందాలు తిలకిస్తూ కడప జిల్లా సిద్దవటం వరకు షికారు చేసే సౌలభ్యం కలుగుతోంది.

- రాపూరు మండలంలోని కండలేరు డ్యాంలోనూ పర్యాటకాభివృద్ధిని గాలికివదిలేశారు. ఇక్కడ అతి పొడవైన మట్టి కట్టడం, పార్కు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. వీటి అభివృద్ధిపై పాలకులు పట్టించుకోవడం లేదు. డ్యాంలో బోటు షికారుకు ప్రతిపాదనలు చేసినా అమలుకు నోచుకోలేదు. ఇక పెంచలకోన అభివృద్ధికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్ అడుగు ముందుకు వేయనంటోంది.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్యామల

కేన్సర్, మానసిక ఆరోగ్యంపై సర్వే పక్కాగా చేయాలి

- ఎన్‌సీడీ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్యామల

నెల్లూరు (వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేన్సర్, మానసిక ఆరోగ్యంపై సర్వే పక్కాగా నిర్వహించాలని ఎన్‌సీడీ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ఆర్ శ్యామల ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఈవో, ఏఎన్‌ఎం, ఆశాలు ఒక బృందంగా ఏర్పడి ఆయా వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. 18 ఏళ్లు దాటిన వారిందరికీ తప్పనిసరిగా కేన్సర్, మానసిక వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. కేన్సర్ స్క్రీనింగ్ దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా జరుగుతోందని పేర్కొ న్నారు. దీన్ని నిరంతరం వైద్యాధికారులు పర్యవేక్షిస్తూ, ప్రతి గురువారం శిబిరాలు నిర్వహించాలని, అనుమానితులను రిఫరల్ ఆసుపత్రికి సిఫార్సు చేయాలని సూచించారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ వీ సుజాత మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన ఇళ్లను ఎట్టి పరిస్థితిలో పూర్తిసర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ రాష్ట్ర కన్సల్టెంట్ రాజ్‌కుమార్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సురేష్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాసవి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

పకడ్బందీగా గణతంత్ర దినోత్సవం



పోలీస్ కవాతు మైదానంలో రూపుదిద్దుకుంటున్న సభావేదిక

(5వ పేజీ తరువాయి)

దినోత్సవ ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలిసి జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పది స్టాళ్లు, పది శకటాలను ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంచినీరు, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జేసీ వెంట ఏఎస్‌పీజీ మునిరాజా, డీఎస్పీ చంద్రమోహన్, డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, ఆర్డీవో అనూష, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు గంగాభవానీ, నాగరాజకుమారి, డీఎంహెచ్‌ఓ సుజాత, డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్చి 19 నుంచి 'డీకేడబ్ల్యూ' వజ్రోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ మహిళా (డీకేడబ్ల్యూ) ప్రభుత్వ కళాశాల వజ్రోత్సవాలు ఈ ఏడాది మార్చి 19, 20 తేదీలలో నిర్వహించాలని ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన పూర్వ విద్యార్థులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. విద్యా బోధనలో డీకేడబ్ల్యూ అత్యుత్తమ ర్యాంకు సాధించిందన్నారు. వజ్రోత్సవాల్లో భాగంగా పూర్వ విద్యార్థులకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ అధ్యాపకులు, సిబ్బందికి సత్కారాలు జరుగుతాయని తెలిపారు. వజ్రోత్సవాల సందర్భంగా సావనీర్ ప్రచురిస్తున్నామని, దీనికి పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు వారి జ్ఞాపకాలను అందించాలని కోరారు. ఆర్టికల్స్‌ను dkalumni1964@gmail.comకు మెయిల్ చేయాలన్నారు. పూర్తి వివరాలకు 93987 79966, 99494 05595, 94415 40317, 77891 49360, 89781 54116, 91829 23406 నెంబర్లను సంప్రదించాలని కోరారు. మీడియా సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు వీ జ్యోతిరెడ్డి, కార్యదర్శి కే కుసుమకుమారి, ట్రెజరర్ టీ జానకి, వైస్‌ప్రెసిడెంట్ జక్కా శేషమ్మ, జాయింట్ సెక్రటరీ ఎన్ జయలక్ష్మి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వజ్రోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

స్వర్ణాల చెరువులో మీనోత్సవం



స్వర్ణాల చెరువులో చేప పిల్లలను వదులుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు స్వర్ణాల చెరువులో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలే మీనోత్సవ కార్యక్రమం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రధాన మంత్రి మత్స్య యోజన (పీఎంఎంవై) పథకంలో భాగంగా ప్రతి సంవత్సరం రిజర్వాయర్లు, చెరువుల్లో చేప పిల్లలను వదులుతారు. అందులో భాగంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, 41వ డివిజన్ కార్పొరేటర్ కువ్వాకుల విజయలక్ష్మి, ఇన్‌చార్జి బాబీ యాదవ్, 35వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బర్నాబాస్, టీడీపీ నాయకుడు కువ్వాకుల మధు 5లక్షల చేప పిల్లలను వదిలారు. మత్స్యకారుల జీవన ఉపాధి కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ రంనాథబాబు, మత్స్య అభివృద్ధి అధికారి సంజయ్ స్టీఫెన్, అధికారులు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో నేడు సర్వభాషా కవితా సమ్మేళనం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి కేంద్రం రూపొందించిన సర్వభాషా కవితా సమ్మేళనం శనివారం అన్నీ ఆకాశవాణి కేంద్రాల్లో ప్రసారం కానుంది. ఈ కార్యక్రమం ప్రాంతీయ భాషల్లో శనివారం రాత్రి 10గంటలకు నెల్లూరు ఆకాశవాణి కేంద్రం ఎఫ్‌ఎం 101.9 చానెల్‌లో ప్రసారమవుతుందని, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం ఎండబ్ల్యూ 738 కేహెచ్‌జడ్‌పైన ప్రసారం అవుతుందని హైదరాబాద్ కేంద్ర కార్యక్రమ విభాగాధిపతి కేఎల్ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రోతలు ఈ కార్యక్రమాన్ని విని ఆనందించాలని కోరారు.

నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత

నెల్లూరు (వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వేదాయపాళెంలో ఉన్న దుర్గా నర్సింగ్ కళాశాలలో 13 మంది విద్యార్థినులు శుక్రవారం మధ్యాహ్నం ఆహారం తీసుకున్న తర్వాత అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడటంతో కళాశాల నిర్వాహకులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. జీజీహెచ్ వైద్యులు చికిత్సలు అందించారు. 11 మంది విద్యార్థినులు కాసేపటికి కోలుకోవడంతో కళాశాలకు వెళ్లిపోయారు. మిగిలిన ఇద్దరు సాయంత్రం వరకు వైద్యం చేయించుకుని కాలేజీకి వెళ్లారు. విద్యార్థినుల అస్వస్థతకు ఫుడ్ పాయిజనే కారణమన్న అనుమానం వ్యక్తం అవుతోంది.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పొదలకూరు : ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరుపూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మరుపూరులో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న ఆకురాతి కోటేశ్వరరావు ఆర్థిక ఇబ్బందులతో తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనీఫ్ తెలిపారు.

కనీస మద్దతు ధర కోసం రేపు రైతుల ట్రాక్టర్ల ర్యాలీ

నెల్లూరు (వ్యవసాయం) : పంటలకు కనీస మద్దతు ధరను గ్యారెంటీ చేస్తూ చట్టం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ట్రాక్టర్ల ర్యాలీ జరగనుంది. దీనిని విజయవంతం చేయాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ఆదివారం ఉదయం నెల్లూరులోని బోసుబొమ్మ కూడలి నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

రేపు పింఛనుదారుల
సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈనెల 26న జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్, కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం ఉదయం 8.30 గంటలకు నెల్లూరు భక్తవత్సల నగర్‌లోని పెన్షన్ భవన్‌లో జరుగుతుందని తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాక ఆవిష్కరణ అనంతరం వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. పెన్షన్‌దారులు, ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని కోరారు.



మంచు కప్పేసింది...

వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పులతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో శుక్రవారం ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కప్పేసింది. పట్టణంలోని ట్యాంక్‌బండ్, 167-బీజీ జాతీయ రహదారిపై వాహనాలు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఉద్యానవన పంటలు, కాలిబాటలను పొగమంచు కమ్మేసింది. ఉదయగిరి పట్టణంపై మంచుదుప్పటి కప్పినట్లయ్యింది. మంచు జల్లులు కురువడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



ఆ ఉద్యోగుల రూటే సెపరేటు...

ఉదయగిరి ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఉద్యోగుల రూటే సెపరేటు. శుక్ర వారం ఉదయం 11.15 గంట లకు కూడా ఒక్కరూ విధులకు హాజరు కాలేదు. దీంతో మం డలంలో వివిధ గ్రామాల నుంచి పలు సమస్యలపై వచ్చిన గ్రామస్థులు వారి రాక కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయానికి విధులకు హాజరవుతారని, సమయ పాలన పాటించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తూ తమకు అనుకూలమైన సమయంలోనే విధులకు హాజరవుతూ మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విధుల్లో సమయపాలన పాటించేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. - ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్



ప్రసంగిస్తున్న వాకాటి విజయకుమార్‌రెడ్డి

రెడ్‌క్రాస్‌లో విప్లవాత్మక మార్పులు

● నూతన చైర్మన్ వాకాటి ప్రమాణస్వీకారం

నెల్లూరు (వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు శాఖ పాలకవర్గం నూతన చైర్మన్‌గా వాకాటి విజయ కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. వైస్ చైర్మన్‌గా దామర్తి జనార్దన్‌రాజు కూడా ప్రమాణం చేశారు. వాకాటి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖకు దేశంలోనే మంచి గుర్తింపు ఉందని, ఇప్పటికే ఎన్నో అవార్డులు కూడా వచ్చాయని తెలిపారు. తమ కమిటీ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రెడ్‌క్రాస్‌ను అగ్రస్థానంలో నిలుపుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బయ్యా ప్రసాద్, రంగయ్య నాయుడు, యడవల్లి సురేష్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా అటవీశాఖాధికారి మహబూబ్ బాషా

ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

● జిల్లా అటవీశాఖాధికారి మహబూబ్ బాషా

కలువాయి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషా తెలిపారు. పట్టా భూమిలో పెంచుకున్న ఎర్రచం దనం చెట్లు నరికి తరలించుకునేందుకు పర్మిట్ జారీ నిమి త్తం శుక్రవారం ఆయన కలువాయికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి రేంజ్‌లో సహజ సిద్ధంగా ఉన్న ఎర్రచందనం కాపాడుకు నేందుకు బేస్‌క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్సు, రెగ్యులర్ అటవీశాఖ సిబ్బంది కలసి కూబింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరితో పాటు తిరు పతి టాస్క్‌ఫోర్సు సిబ్బంది కూడా శుక్రవారం నుంచి రాపూరు రేంజ్ పరిధిలోని గోనుపల్లి, తెగచర్ల అటవీ ప్రాంతాల్లో కూబింగ్ ప్రారంభిం చినట్లు తెలిపారు. దీంతో పాటు చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయడం, డాగ్‌స్క్వాడ్‌ను ఉపయోగించుకుని అక్రమ రవాణాను నిరోధిస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట రాపూరు రేంజర్ రవీంద్రబాబు, కలువాయి డీఆర్వో బాలాజీ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి వద్ద ఈ నెల 19వ తేదీ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మరణించినట్లు సీఐ జీ వేణు పేర్కొన్నారు. నెల్లూరులో స్కూటర్ మెకానిక్‌గా పని చేస్తున్న మహేష్ (32) స్కూటర్‌పై వెళ్తూ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడని తెలిపారు. తలకు గాయాలై చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పారదర్శక సేవలు..

ప్రగతికి అడుగులు

● పంచాయతీల్లో అక్రమాలకు ఇక చెక్
● 'స్వర్ణ పంచాయతీ' పేరిట ఆన్‌లైన్ చెల్లింపులు
● ఆదాయ వనరులన్నీ ప్రత్యేక యాప్‌లో నమోదు

పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. స్వర్ణ పంచాయతీ పేరిట ఆన్‌లైన్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి చెల్లింపు ఆన్‌లైన్‌లో నిర్వహించేలా డిజిటలైజేషన్ చేస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరగనుంది.

- సంగం (ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమై ఎటువంటి అభి వృద్ధి పనులకు నోచుకోలేదు. మౌలిక వసతుల కల్పన కుంటుపడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామాల సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. అంతేగాక పంచాయతీల్లో అక్రమాల నిరోధానికి చర్యలు చేపడుతోంది. ప్రజలకు పారదర్శకంగా సమా చారం, సేవలు అందించేందుకు వీలుగా స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌కు రూపకల్పన చేశారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు సన్నద్ధమవుతోంది. దీని ద్వారా ఎక్కడ ఉన్నా పన్నులు సకాలంలో చెల్లించే వెసులుబాటు కల్పించనున్నారు. ఇందుకుగాను స్వర్ణ గ్రామ పంచాయతీ వెబ్‌సైట్ అందుబాటులో ఉంచారు.



గ్రామ పంచాయతీ కార్యాలయం

● అక్రమాలకు అడ్డుకట్ట

పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చిన ఆదాయానికి గండికొట్టకుండా డిజిటల్ విధానం ఉపయోగపడుతుంది. గతంలో పలు గ్రామాల్లో పన్నుల దుర్వినియోగం అయిన ఘటనలు జరిగాయి. నిధుల దుర్వినియోగం కావడం, ఆలస్యంగా వెలుగు చూడడం.. వాటిపై ఫిర్యాదులు, దర్యాప్తులు, విచారణ పరిపాటిగా మారింది. వీటిన్నిటికి ఈ కొత్త విధానంతో అడ్డుకట్ట పడుతుందని అధికారులు చెబుతున్నారు.

● ఆదాయ వనరుల నమోదు

పంచాయతీల్లో ఎలాంటి లావాదేవీలు జరిగినా స్వర్ణ పంచాయతీ పేరిట ఆన్‌లైన్ చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పైసా, ప్రతి పని ఇకపై పక్కాగా లెక్క తేలనుంది. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నివాస గృహాల పన్నులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అసెస్‌మెంట్లవారీగా ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. త్వరతగతిన ఈ ప్రక్రియ పూర్తి చేసి డిజిటల్ రూపంలో సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లాలో 722 గ్రామ పంచాయతీలు ఉండగా, అన్నింటా డిజిటలైజేషన్ జోరుగా సాగుతోంది.

సంగం మండలంలోని 20 పంచాయతీల్లో డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కార్యదర్శులు దగ్గర ఉండి వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు.

● ఆన్‌లైన్ ద్వారా పొందే అవకాశం

స్వర్ణ పంచాయతీల పేరుతో ప్రభుత్వం పౌరసేవలను సులభతరం చేయనుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు ఆయా పంచాయతీల నుంచి ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. ఇంటి పన్ను, ఇతర రుసుములను అదే విధానంలో చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. చాయతీల అభివృద్ధికి డిజిటల్ సేవలు ఎంతగానో ఉపయోగపడుతాయి.

నమోదు చేసే వివరాలివే..

స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో మొదటగా పంచాయతీ ముఖచిత్రం అప్‌లోడ్ చేస్తారు. ఆ తరువాత ప్రతి ఇంటి విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు, ఏడాదికి ఎంత పన్ను చెల్లిస్తున్నారు. ఆస్తి, వ్యాపార సముదాయాలకు సంబంధించి పన్నులు, చెరువులు, స్థలాలు, లీజు, సెల్‌టవర్లు, పరిశ్రమలు, రోజువారీ వ్యాపారాల నుంచి చేస్తున్న వసూళ్లు ఇలా పంచాయతీలకు ఆదాయం తెచ్చే అన్ని వివరాలను నమోదు చేస్తున్నారు. పన్నుల రూపంలో పంచాయతీలకు వస్తున్న ఆదాయం పక్కదారి పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

బాలికలకు బంగారు భవిత

ప్రతి ఒక్కరి బాధ్యత

● బాలికల దినోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (హరనాథపురం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు బంగారు భవిష్యత్తు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుజాత అన్నారు. జాతీయ బాలికా దినోత్స వం సందర్భంగా శుక్రవారం ఉదయం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నెల్లూరులోని కస్తూరిదేవి హైస్కూల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెద్దలో విద్యార్థినులు పాల్గొని బాలికా విద్య, సంరక్షణపై నినాదాలు చేశారు. డీఎంహెచ్‌వో సుజాత మాట్లాడుతూ బాలికలు అన్నీ రంగాల్లో ఉన్నతంగా రాణించేందుకు లింగవివక్ష లేకుండా అన్నీ అవకాశాలను సమానంగా కల్పించాలన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలే బాలికలకు మనం ఇచ్చే నిజమైన గౌరవాలన్నారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అవగాహన పెంచడమే జాతీయ బాలికా దినోత్సవ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ అనురాధ, జిల్లా కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వరరావు, సమగ్ర శిశు ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఎంఈవో జానకిరాం, బాలల సంరక్షణ అధికారి సురేష్, సమత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు శ్రీనివాసరావు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ర్యాలీలో డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు, బాలికలు

పురుషుల విభాగంలో కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు



జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

నేటి నుంచి అంకుపల్లిలో రాష్ట్రస్థాయి పోటీలు

కోవూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా అంకుపల్లిలో శనివారం నుంచి జరగనున్న అంతర జిల్లాల సీనియర్ కబడ్డీ పోటీలకు పురుషులు, మహిళల జిల్లా జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. పురుషుల జిల్లా జట్టుకు సోమరాజుపల్లికి చెందిన డీ మునిచంద్ర (కెప్టెన్), సభ్యులుగా ఎన్.శ్రీధర్, జే.విజయబాబు, యూ.శేషు (కోవూరు), యాకోబు, ఆర్.సునీల్ (ముదివర్తి), పీ.కమలాకర్, డీ.శ్రీశాంత్ (సోమరాజుపల్లి), ఆర్.శ్రావణ్ (నెల్లూరు), డీ.విష్ణువర్ధన్ (విడవలూరు), జస్వంత్ (చెర్లోపాళెం) ఎన్నికయ్యారు. టీమ్ మేనేజరుగా సీహెచ్ హర్షవర్ధన్, కోచ్‌గా నరేష్‌లను నియమించారు. మహిళల జట్టుకు రామచంద్రాపురంకు చెందిన మేరీ ఫ్లారెన్స్ (కెప్టెన్), సభ్యులుగా ఐ.తులసి (నెల్లూరు), మధులత (శ్రీనివాసస్రతం), ప్రసన్న (కమ్మ పాలెం), ఉమాభారతి (ముత్తుకూరు), కే.ప్రవల్లిక (పాతకడపాలెం), రోహిణి (కరేడు), శుభ కేషిత (నెల్లూరు), ఎం.ప్రవల్లిక (నెల్లూరు), వీ.అలేఖ్య (కరేడు), వర్షిత (కరేడు) ఎన్నికయ్యారు. టీమ్ మేనేజరుగా వైష్ణవిని నియమిం చారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా కబడ్డీ అసోసియోషన్ నాయకులు లవకుమార్, విజయానందం, డేవిడ్ జాన్సన్, కొండలరావు, సింహాద్రి తదితరులు అభినందించారు.

CRIME NEWS

వ్యక్తి అనుమానాస్పద మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయం పక్కన సన్నిధి రేవు వద్ద పెన్నానది ఒడ్డున బండల పైన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి ఆలయ సిబ్బందికి, స్థానిక సర్పంచుకు సమాచారం ఇచ్చారు. ఆయన ద్వారా సమాచారం అందుకున్న సీఐ.శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు... నార్త్ ఆములూరుకు చెందిన గుంజి మురళి (44) అగ్నిమాపక శాఖలో పని చేసేవారు. విధి నిర్వహణలో అలసత్వంతో సస్పెన్షన్‌కు గురై ఏడాదిగా విధులకు వెళ్లడం లేదు. ఈ క్రమంలో గత కొంత కాలంగా జొన్నవాడలో ఉంటూ శుక్రవారం పెన్నానదిలో శవమై కనిపించాడు. అతని శరీరంపై గాయాలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి. కాగా మృతుడు గురువారం సాయంత్రం 6గంటల సమయంలో ప్రొటెక్షన్ వాల్ వద్ద మద్యం సేవిస్తుండడాన్ని ఆలయంలోని ఓ స్వీపర్ గమనించినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో మద్యం మత్తులో ప్రమాదవశాత్తు పడి తలకు బలమైన గాయమై మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మురళి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న స్థానికులు

మహిళలు, బాలికల భద్రతే లక్ష్యం

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని కస్తూరి దేవి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, ఏహెచ్‌టీయూ సిబ్బంది వై శ్రీహరి, డీ సతీష్, కే ప్రసాద్, టీవీఎస్ రాంబాబు పాల్గొన్నారు.

ఇస్లాంపేటలో కార్డెన్‌సర్చ్

● పత్రాలు లేని 37 మోటారు సైకిళ్లు, ఆటో స్వాధీనం
● అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యం: డీఎస్పీ

కావలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ క్రిష్ణక్రాంత్ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణ, నేరాల అదుపు, శాంతి భద్రతలు పరిరక్షణే లక్ష్యంగా పోలీస్‌లు కార్డెన్ సర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. స్థానిక ఇస్లాంపేటలో శుక్ర వారం తెల్లవారు జామున 4.30 గంటలకు డీఎస్పీ పీ.శ్రీధర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 11మంది ఎస్‌ఐలు, సిబ్బంది, స్పెషల్ పార్టీలతో కలిసి సుమారు 60 మంది తో 200 ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో సరైన పత్రాలు లేని 37మోటారుసైకిళ్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. సరైన పత్రాలు లేని వాహనాలను ఎవరూ కొనవద్దని, అలాంటి వాహనాలు వాడితే నేరాలు చేసేవారికి సహకరించినట్లు అవుతోందన్నారు. ఎవరైనా సరైన పత్రాలు లేని వాహనాలు విక్రయిస్తామంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. అలాగే తనిఖీలో పరారీలోని నేరస్థులను గుర్తించటం, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ, రెండో పట్టణ, రూరల్ సీఐలు ఫిరోజ్, గిరిబాబు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.



కార్డెన్ సర్చ్‌పై సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీధర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7785
వెండి కిలో ధర	రూ. 94,000
వెండి ఒక గ్రాము	రూ.97.00

బంగారం కాజేసిన నిందితుడి అరెస్ట్

● రూ.52 లక్షల ఆభరణాలు స్వాధీనం

నెల్లూరు(క్రైం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బంగారు వ్యాపారుల నుంచి ఆర్డర్లు ఇప్పిస్తానని నమ్మించి ఆభరణాలను కాజేసిన వ్యక్తిని నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.52 లక్షల విలువ చేసే 660 గ్రాముల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నగర డీఎస్పీ కార్యాయలంలో డీఎస్పీ పీ సింధుప్రియ శుక్ర వారం నిందితుని వివరాలు మీడియాకు వెల్లడించారు. నగరంలోని వెంకటేశ్వరపురం ఇస్లాంపేట కు చెందిన షేక్ ముజఫర్ బంగారు ఆభరణాల తయారీదారుడు. ఆయన కమీషన్ పద్ధతిపై కొరడావీధిలోని బంగారు వ్యాపారుల వద్ద ఆర్డర్లు తీసు కొని తయారు చేసి ఇస్తూ ఆర్థికంగా స్థిరపడ్డారు. గతంలో ఆయన పరమే శ్వరి నగర్‌కు చెందిన జాకీర్ వద్ద పనిచేశారు. ముజఫర్ ఎదుగదలను చూసి ఓర్వలేని జాకీర్ ఎలాగైనా ఆర్థికంగా దెబ్బకొట్టాలని నిర్ణయించుకు న్నాడు. ఇదిలా ఉండగా ఇటీవల ముజఫర్ బంగారు వ్యాపారుల వద్ద రూ.52 లక్షల విలువ చేసే 660 గ్రాముల బంగారాన్ని తీసుకుని ఆకర్షణీయ మైన మోడల్స్‌లో ఆభరణాలు తయారు చేశారు. ఈ విషయం తెలుసుకు న్న జాకీర్ వాటిని కాజేయాలని పథకం వేశాడు. ఈ నెల 23న ముజఫర్‌కు ఫోన్‌చేసి కొత్త నగలు తీసుకువస్తే తెలిసిన వ్యాపారులకు చూపించి ఆర్డర్లు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ముజఫర్ బంగారు ఆభరణాలను తీసుకు ని జాకీర్ ఇంటికి వెళ్లాడు. ఆభరణాలున్న కవర్‌ను జాకీర్ బ్యాగులో పెట్టు కున్నాడు. వ్యాపారుల వద్దకు వెళ్దామంటూ ముజఫర్‌తో కలిసి బయలుదేరా డు. అయితే ఈ క్రమంలో ఆభరణాలున్న కవర్‌ను తెలివిగా ఇంట్లోనే పడేశాడు. అనంతరం ఏమీ తెలియనట్లు ముజఫర్ బైక్‌పై వెనుక కూర్చొని బంగారు వ్యాపారి ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత బ్యాగ్‌లో కవర్ కనిపించడం లేదని, ఎక్కడ పడిపోయిందో తెలియదంటూ నటించాడు. దీంతో ఇద్దరు కలిసి వారు వచ్చిన మార్గంలో వెతుక్కుంటూ ఇంటి వరకు వెళ్లారు. ఆభరణాల కవర్ కనిపించక పోవడం, మాజీ యజమాని ప్రవర్తనపై అనుమానం రావడంతో ముజఫర్ శుక్రవారం తెల్లవారుజామున చిన్నబజా రు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు దర్యాప్తు చేపట్టారు. జాకీర్ ఇంట్లో లేకపోవడం, అక్కడున్న సీసీ కెమెరాలు ఆఫ్‌చేసి ఉండటం గుర్తించారు. సాంకేతికత ఆధారంగా జాకీర్‌ను ఇరగాళమ్మ గుడి సమీపంలో అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించగా బంగారు ఆభరణాలు కాజేసినట్లు అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి 660 గ్రాముల బంగారు ఆభరణాలను సాధీనం చేసుకున్నారు. గంటల వ్యవధిలో కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావుతోపాటు ఏఎస్‌ఐ శ్రీహరి, హెడ్‌కానిస్టేబుళ్లు సురేష్, కృష్ణకిశోర్, కానిస్టేబుళ్లు శ్యామ్, సుబ్బారావు, రియాజుద్దీన్, సైబర్ వింగ్ సిబ్బంది ప్రసాద్, కిషోర్, డ్రైవర్ రామాంజనేయరెడ్డిని డీఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ సింధుప్రియ

ఇందిరమ్మ కాలనీలో జంటనాగుల శిలాప్రతిష్ఠ


వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం జంటనాగుల శిలాప్రతిష్ఠ కార్యక్రమం, అశ్వథనారాయణ కల్యాణంను నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఈ వేడుకలో పాల్గొనగా ఆయనకు ఆలయకమిటీ బాధ్యులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కాలనీలో రూ.1.7కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, బాలగురుస్వామి, వెంకట్రావు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేల ఫొటోలకు పాలభిషేకం

కావలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మ పేరు నామకరణం చేయడంతో టీడీపీ నేత తిరువీధి ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ అభిమానులు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కావలిలోని ఐకాన్ సెల్ఫీ సెంటర్ వద్ద సాయంత్రం జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలు, మాగుంట అభిమానులు పాల్గొన్నారు.

2027 నాటికి కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యం

సంగం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2027 నాటికి కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్ వలీ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిరుమనతిప్ప, ఎస్టీ కాలనీలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేస్తే అంగవైకల్యం నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి, అశోక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈఓ

లింగసముద్రం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 100రోజుల కార్యక్రమాన్ని అమలు చేయాలని డీఈఓ బాలాజీరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆయన లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం బ్లాక్‌బోర్డుపై గణితంలో కొన్ని లెక్కలు వేసి వాటికి సమాధానాలు చేయించారు. దాతలు, పూర్వ విద్యార్థులు సహకారంతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను హెచ్‌ఎం మాధవరావు డీఈఓకు వివరించారు.

పకడ్బందీగా సర్వేలు నిర్వహించాలి


పంచాయితీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో జే మోహనరావు

చేజర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో జే మోహనరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎమ్ ఎస్ఎమ్ఈ సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, పీఎసిఎస్ సర్వే, జియోకోఆర్డినేట్ సర్వే, కమ్యూనిటీ అసెట్స్ తదితర సర్వేలపై తగు సూచనలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులందరూ సచివాలయ సిబ్బందితో కలిసి సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం చేజర్ల సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలలిత, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేపై సమీక్ష

కలువాయి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై నిర్వహిస్తున్న సర్వేపై శుక్రవారం కలువాయి సచివాలయంలో సిబ్బందితో జిల్లా పరిషత్తు ఉప కార్య నిర్వాహణాధికారి జే మోహన్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పలు సర్వేల ప్రగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఈవో పీఆర్డీ రమేష్, ఎంపీడీవో కార్యాలయం పరిపాలనాధికారి శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

మహదేవపురం సర్పంచ్ టీడీపీలో చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరిన మహదేవపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పద్మ, వెంకటరావు

కందుకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహదేవపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పద్మ, ఆమె భర్త కొమ్మిరెడ్డి వెంకటరావు మరో 15కుటుంబాల సభ్యులతో కలిసి శుక్రవారం తెలుగుదేశంలో చేరారు. వారి వెంట వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రావినూతల రాజు, అన్నపురెడ్డి వెంకటరావు ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, గుళ్లా శ్రీనివాసులు, గుళ్లా బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు సందర్శన

కందుకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డును సాయంత్రం ఎమ్మెల్యే సందర్శించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యత పరీక్షల కోసం ఏర్పాటు చేసిన అగ్రి టెస్టింగ్‌ల్యాబ్‌ను పరిశీలించారు. వార్షిక రాబడి, సెస్సు వసూళ్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఏఎంసీ కార్యదర్శి రామాంజనేయులు, అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఇంఛార్జి గీత ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

ఉదయగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లి, ఉదయగిరి ఉర్దూ బీసీ కాలనీ తెలుగు, ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను శుక్రవారం ఎంఈవో-2 శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు సులభరీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అపస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ (ఎంఎంటీఎస్‌ఈ) పాఠశాల, నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం సీఐ జి గంగాధర్, అపస్మా నేతలు బహుమతులను అందజేశారు. ముందుగా పట్టణంలోని రెయిన్‌బో ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో అపస్మా నేతలు కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఎంఎంటీఎస్ కన్వీనర్ రమణారెడ్డి, అపస్మా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఈగ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఫిబ్రవరి 4న టాలెంట్ టెస్ట్ నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.


తగ్గిన దిగుబడి, దిగజారిన ధర

నష్టాల ఊబిలో అన్నదాతలు


కల్లాల్లో రైతులు ఆరబోసిన వరిధాన్యం

ఉదయగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తగ్గిన దిగుబడి, దిగజారిన ధరలతో అన్నదాతలు నష్టాల ఊబిలో కూరుకుపోతు న్నారు. ప్రభుత్వం చెబుతున్న రై తు పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైందని రైతులు ఆరోపిస్తున్నారు. మండల ంలో గత ఖరీఫ్ సీజన్‌లో సుమా రు 400 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. తుపాన్‌ల ప్రభా వంతో ఆశించిన మేర దిగుబడి రాలేదని, దీనికితోడు మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చిందని తెలుపుతున్నారు. దళారులు రైతుల వద్ద నుంచి 75 కేజీల బస్తా రూ.1,400కు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటకు తగిన ప్రతిఫలం రాక ఆరుగాలం కష్టమే మిగులుతోందని రైతన్నలు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధరకు వరి పంటను కొనుగోలుచేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయా



- కాశిరెడ్డి, రైతు, కృష్ణారెడ్డిపల్లి

మూడెకరాల్లో రూ.1.20 లక్షల పెట్టుబడితో వరిపంట సాగు చేశా. ఎకరాకు 20-25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. ప్రస్తుతం బస్తా రూ.1,400లు కంటే ఎక్కువ ధర పలకడంలేదు. ఈ ధరతో పెట్టుబడులే తప్ప ఆరుగాలం పడిన కష్టం, శ్రమ వృథా అయ్యింది.

గిట్టుబాటు ధర కల్పించండి



- కాకు వెంకటయ్య, రైతు సంఘం నాయకులు

రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలి. బహిరంగ మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

ఆత్మకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బాలికల సంరక్షణ సామాజిక బాధ్య త అని, బాలికా విద్యను ప్రోత్సహించడమే కా కుండా, వారికి ఉన్న హక్కులు, చట్టాలపై అవ గాహన కల్పించాలనే లక్ష్యంతో బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎల్ఆర్ పల్లి అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్ సుప్రజ, షేక్ షకీలా ఆధ్వర్యంలో చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఆర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ఏఎస్ పేట: బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల తెలిపారు. స్థానిక కేజీ బీవీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పోషకాహారం, అంటువ్యాధులు, బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రషీద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీని వాసులు, ఏఎన్ఎం శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.
- అనంతసాగరం: కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో ఎంఈవో కే ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరదేవి, ఉపాధ్యాయులు హజరత్, వెంకటరమణమ్మ, మనోజ్‌కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.
- సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డితోపాటు గురుకుల పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- చేజర్ల: మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్- బ్యాడ్ టచ్ తదితర అంశాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- మర్రిపాడు: కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొని బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మిదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- కావలి టౌన్ : టీవీఎస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని బాలికల వసతి గృహంలో మానసిక వైద్య నిపుణురాలు రమ్య, ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ముసునూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో జమాతె ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కావలి శాఖ బాధ్యురాలు ఫాతిమ పాల్గొన్నారు.

కావలి రూరల్ : మన్నంగిదిన్నె పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరత్నం జాతీయ బాలికా దినోత్సం సందర్భంగా విద్యార్థినులతో ప్లకార్డులు చేతపట్టుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

- కందుకూరు: కేజీబీవీలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ రజనీ ఆధ్వర్యంలో వరల్డ్‌విజన్ మేనేజరు యషియా విద్యార్థినులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో, టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కలగట్ల హజరత్తయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
- వలేటివారిపాలెం : జమీన్‌ఉప్పలపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సూపర్‌వైజర్ సునీత మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ గోవర్ధినీ, పీహెచ్ఎన్ నవమణి, టీచర్లు, పాల్గొన్నారు.



కావలి: జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫాతిమ


కందుకూరులో బాలికా దినోత్సవంలో ప్రసంగిస్తున్న వక్తలు


'సంగంలో బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

అప్రమత్తతతోనే రోడ్డుప్రమాదాల నివారణ : ఎంవీఐ



ఆత్మకూరు: రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు


ఉదయగిరి : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐలు, సిబ్బంది

ఆత్మకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నిరారించవచ్చని ఎంవీఐ శ్రీరాములు, సీఐ జి గంగాధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ప్రైవేట్ స్కూల్ వాహనాల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలన్నారు. మత్తుపానీయాలు సేవించి, సెల్ ఫోన్ లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని సూచించారు. రోడ్డు మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం షేక్ కరీమున్నీసా, ఏఎమ్ రాజ్‌కుమార్, ఏఎంవీఐ మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- సంగం: స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణంలో ఆటో డ్రైవర్లకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీఐ వేమారెడ్డి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమనిబంధనలు పాటించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ, పాల్గొన్నారు.
- అనంతసాగరం: హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలంటూ అనంతసాగరం పోలీసులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సిబ్బందితో పాటు స్థానికులు తమ ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి, ఏఎస్ఐ మస్తాన్ పాల్గొన్నారు.
- ఉదయగిరి: ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ ఎన్.వెంకటరావు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది, పట్టణ ప్రజలతో కలిసి హెల్మెట్ వినియోగంపై పట్టణంలోని మెయిన్ బజార్, సినిమాహాలు వీధి, నాగులబావి వీధి, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.
- వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి నుంచి తోటచెరువుపల్లి వరకు శుక్రవారం గ్రామస్థులతో కలిసి పోలీసులు హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో వాహనాలపై హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వరికుంటపాడు, ఉదయగిరి ఎస్ఐలు రఘునాథ్, ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- కలిగిరి : హెల్మెట్ ప్రయాణం సురక్షితం అని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఉమాశంకర్ సూచించారు. ఈ విషయపై శుక్రవారం పోలీసు సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
- జలదంకి: ఎస్ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో పోలీసులు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి గట్టుపల్లి కూడలి వరకు ఈ ర్యాలీని చేపట్టారు. అనంతరం రోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహనదారులతో మాట్లాడి నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి

- లేఅవుట్ రాళ్లను తొలగించిన ఎంపీడీఓ


ఆముదాలదిన్నె సమీపంలోని రాళ్లను తొలగిస్తున్న ఎంపీడీఓ, పంచాయతీ అధికారులు

కావలి రూరల్, జనవరి24: అనధికార లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు కొనుగోలుదారులను మోసగిస్తున్నారని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆముదాలదిన్నె సమీపంలోని సుబ్రమణ్యం లేఅవుట్‌లో పంచాయతీ అనుమతులు లేకుండా వేసిన రాళ్లను ఎక్స్‌వేటర్‌తో తొలగింపు జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలో నుడా అనుమతులు లేని లేఅవుట్ల జాబితా తమకు అందిందని పంచాయతీ అధికారులను ఆదేశించారు. శంకరమఠం లో లేఅవుట్లు ఉన్నట్లు వాటిని తగు చర్యలు తీసుకుంటామన్నారు. లేఅవుట్ వేసేటప్పుడు ఆయా పంచాయతీల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఆ భూమి లో పంచాయతీకి 10శాతం ఇవ్వాలన్నారు. అలాగే ఓపన్ స్పేస్ కు 14శాతం చలానా కట్టాలని, అనధికార లేఅవుట్లతో కన్వర్షన్ చేసుకుని రైతుల నుండి నేరుగా ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో రిజిస్టేషన్ ఫీజులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీఆర్వో శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్, ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటరమణ, సర్వేయర్ సంజు సుల్తానాపాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సినిమా థియేటర్ యాజమాన్యానికి నోటీసు

కావలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు ఈనెల 15 నుంచి 23 వరకు మాత్రమే అధిక ధరలకు టిక్కెట్లను అమ్ముకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. అయితే 24న కూడా టికెట్లను అధిక ధరలకు శ్రీవెంకటేశ్వర సినిమా థియేటర్ యాజమాన్యం అమ్ముతున్నారని పట్టణానికి చెందిన వెంకటేశ్వరరావు మరికొంత మందితో ఆర్డీవో ఎం.సన్నీ వంశీ క్రిష్ణకు శుక్రవారం అభియోగాలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వమని ఆర్డీవో థియేటర్ యాజమాన్యానికి నోటీసు పంపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉదయగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చాకలవీధిలో శుక్రవారం శిధిలావస్థకు చేరిన ఓ విద్యుత్ స్తంభం ఇంటి గోడపై కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే సిబ్బందికి సమాచారం అందించడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపేశారు. అనంతరం నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

బిజ్జంపల్లిలో కొండచిలువ మృతి

ఉదయగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపాన గల వరి పొలాల్లో శుక్రవారం కొండచిలువ దర్శనమిచ్చింది. యంత్రంతో వరి పంటను నూర్పిడి చేస్తుండగా అందులో చిక్కుకుని కొండచిలువ మృత్యువాత పడింది. గమనించిన రైతులు దానిని బయటకు తీశారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా పాఠశాల ప్రహరీ ఎత్తును పెంచేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్‌కు సూచించారు.

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి

ఉదయగిరి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గండి పాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు శోభన్‌బాబు అన్నారు. శుక్రవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ సెంటర్, ప్రధాన వీధుల్లోని చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, క్లర్కులు రమేష్, అజయ్, మెసెంజరు చిన్నఖాశిం పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ఆత్మకూరు : రైతులు, పశుపోషకులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ కూరు పశుసంవర్ధక శాఖ ఏడీ ఎస్ జయచంద్ర కోరారు. అప్పారావుపాళెంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు పలు రకాల మందులను పశుపోషకులకు అందజేశారు.

- సీతారామపురం : పాడి రైతుల కోసం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు కోరారు. గుండుపల్లి పంచాయతీలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా విఏ మాలాశ్రీ మాట్లాడుతూ పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రీయ గోకుల మిషన్ కింద ఖనిజ లవణ మిశ్రమాన్ని పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఏ కొండయ్య, శ్రీను, వీఏఏ నరేంద్ర పాల్గొన్నారు.

బెల్టు దుకాణంపై దాడి

కావలి రూరల్ : అన్నగారిపాలెం బెల్టుదుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. జెడ్డా వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 10మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

కలువాయి : మండలంలోని వెరుబొట్లపల్లిలో దళిత యువ కులపై జరిగిన దాడి కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ శుక్రవారం తహసీల్దారుకు ఏడీపీయస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్ వినతి పత్రం అందజేశారు. కౌంటర్ కేసు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగునీటిని వృథా చేయొద్దు

అల్లూరు : ఏటీఎస్ చానల్ ఆయకట్టు పరిధిలోని రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ఇరిగేషన్ ఏఈ సుధీర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన నీటి సంఘం డైరెక్టర్లతో ఆయన తొలి సమీక్షించారు. కార్యక్రమంలో మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, పరంధామరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అంబటి రాజేంద్ర, రామకృష్ణారెడ్డి, అల్లాబక్షు పాల్గొన్నారు.

నూతన ధర్మకర్త మండలి ఏర్పాటు

అల్లూరు : తూర్పుగోగులపల్లి శ్రీరామ మందిరానికి నూతన ధర్మకర్త మండలిని శుక్రవారం గ్రామస్థులు ఎన్నుకున్నారు. ఆలయ చైర్మన్‌గా ముంతా శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా నెల్లూరు కాంతారావుతో ఏడు సామాజిక వర్గాల్లోని 21 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తోట శ్రీనివాసులు, కీర్తి వెంకయ్య పాల్గొన్నారు.

వీర్లగుడిపాడు సర్పంచ్ మృతి

సంగం : వీర్లగుడిపాడు సర్పంచ్ జి చెంచురత్నం నాయుడు (55) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. కాగా, సర్పంచ్ మృతివార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

గణతంత్ర వేడుకలకు విలుకానిపల్లి సర్పంచు

తోటపల్లిగూడూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విలుకానిపల్లి గ్రామ సర్పంచు గోపిరెడ్డి పావని విజయవాడ రాజ్‌భవన్‌లో జరుగుతున్న గణతంత్ర వేడుకలకు హాజరవుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆనంద్ సిఫార్సుతో ఈ నెల 26న విజయవాడ రాజ్‌భవన్‌లో జరుగుతున్న ఎట్‌హోమ్ కార్యక్రమానికి మహిళ ప్రతినిధిగా ప్రత్యేక ఆహ్వానం అందిందని తెలిపారు.

సర్వేలపై జడ్పీ సీఈవో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

సైదాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో విద్యారమ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఎస్‌ఎంఈ, పీఏసీఎస్, లిటరసీ, మిస్సింగ్ సిటిజన్ సర్వేలపై మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఉల్లాస్ కార్యక్రమం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తమ శివకుమార్, మండల అధికారులు, ఏపీఎం చంద్రశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీ పరిధిలోని పెనుబల్లిలో శుక్రవారం అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి లెప్రసీ సర్వేని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివకుమార్, ఏఎన్‌ఎం అరుణమ్మ, డీపీఎస్ శ్రావణ్, టీబీ సూపర్‌వైజర్ సురేష్ కుమార్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

జగదేవిపేట పీహెచ్‌సీ తనిఖీ

ఇందుకూరుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, జిల్లా 104 నోడల్ ఆఫీసర్ డాక్టర్ పీఎల్.దయాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, మందులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రికార్డులు సరిగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా చూడాలని, గ్రామస్థాయిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా ఎన్సీడీ సీడీ సర్వే, కుష్టు వ్యాధి సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్, మాస్ మీడియా అధికారుల నూతన డైరీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత శుక్రవారం ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డైరీతోపాటు టేబుల్ క్యాలెండర్లను ప్రారంభించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డెమో కనకరత్నం, మంజుల, హెచ్‌ఈఈ నరసింహారావు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..!

● మాజీ మంత్రి కాకాణికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి సవాల్

పొదలకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన రాజకీయ జీవితంలో జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఏం చేశారో, తాను ఓడినా, గెలిచినా ఎలాంటి అభివృద్ధి చేశానో తేల్చుకునేందుకు చర్చకి సిద్ధమా అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం శుక్రవారం మండలంలోని తాటిపర్తిలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును, తాటిపర్తి పశువైద్యశాల వద్ద జరిగిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే తాటిపర్తి గ్రామంలోని బిట్-1 సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి అభివృద్ధి కోసం పాటుపడుతున్న తనపై మాజీ మంత్రి కాకాణి ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్యాకేజ్ వర్కులు చేయకుండేనే చేసినట్లు బిల్లులు చేసుకుని రూ.కోట్లు దోచుకున్న కాకాణి అందరు తన లాగే ఉంటారని భ్రమపడుతున్నారని విమర్శించారు. ఈనెల 31వ తేదీ వరకు జరిగే పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గోసూజ చేసి గోవు, గేదె దూడలకు అందాల పోటీలను నిర్వహించి విజేతలైన వెన్నపూస రాజగోపాల్‌రెడ్డి, తల్లిక వేణు, సంగన వసంత్, మన్నవరపు మనోహర్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో పశుసం వర్ధక శాఖ జేడీ కె.రమేష్‌నాయక్, డీఎల్‌డీఏ శ్రీనివాసరావు, డీడీ నాగమణి, ఏడీ కె.అరుణ, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బుజ్జం సుబ్బిరామిరెడ్డి, దేవళ్ల ఆదిశేషారెడ్డి, తాళ్లపల్లి తిరుపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సిమెంటు రోడ్డు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, నాయకులు

సమష్టి కృషితో దోమల నివారణ

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 24, (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతో అధికారులు, స్థానిక నాయకులు సమష్టిగా కృషి చేస్తే దోమలను నివారించవచ్చని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ దోమలను నివారించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. నగరంలో రూరల్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న దోమలపై దండయాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా పరిశీలించారు. తన బజాజ్ చేతక్ స్కూటర్‌పై తిరుగుతూ 18, 19, 20, 32, 33 డివిజన్లలో దోమల నివారణ పనులు తనిఖీ చేశారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి మురికి కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. దోమల నివారణకు అన్ని రకాల చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని యంత్రాంగానికి సూచించారు. ఇకనుంచి ప్రతి శుక్ర, శనివారాల్లో ఆకస్మిక తనిఖీలు జరుపుతానని చెప్పారు. ఈ కార్యక్రమాలలో స్థానిక కార్పొరేటర్లు, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.



తన బజాజ్ చేతక్ స్కూటర్‌పై పనుల పరిశీలనకు వెళ్తున్న రూరల్ ఎమ్మెల్యే

రోడ్లపై చెత్తేస్తే జరిమానా : కమిషనర్

నెల్లూరు(సిటీ), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లపై చెత్తేస్తే జరిమానా విధిస్తామని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని 4వ డివిజన్ పరిధిలో పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. రోడ్లపై ఎవరెవరు చెత్త వేస్తున్నారో గమనించాలని ఆదేశించారు. అలాంటి వారికి భారీగా జరిమానా విధించాలని సూచించారు. పాత చెత్త కుండీల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేయడంతో వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కాగా, సిటీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సింధుప్రియ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

● వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజ యభాస్కర్‌రావు సూచించారు. వీఎస్‌యూలో శుక్రవారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వి ద్యా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు వినూత్నమైన కార్యక్రమాలను యూనివర్సిటీ నిర్వహిస్తోందన్నారు. అనంతరం కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు విశ్వభారతి, షేక్ షీరు, సిద్ధార్థ కృత్రిమ మేధస్సుపై తమ అభిప్రాయాలను తెలుపుతూ ప్రాజెక్ట్ పరిశోధనలను ప్రదర్శించారు. అలాగే ఉమెన్ సెల్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయంతో ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ప్రారంభించి మాట్లాడారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, శ్రేయస్సు పెంపొందించడంలో సహకరించి సమాజంలో లింగసమానత్వాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.హనుమారెడ్డి, డీన్ సీడీసీ డాక్టర్ ఎం.హుస్సేనయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ అందె ప్రసాద్, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పసుపులేటి వసుమతి, డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ ఎస్ వేణుగోపాల్, డాక్టర్ జీ సాయి స్రవంతి తదితరులున్నారు.



మాట్లాడుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

ఆడపిల్లలకు బంగారు భవితనిద్దాం



రాపూరులో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు, అధికారులు

రాపూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలురుతో సమానంగా అవకాశాలు కల్పించి బాలికలకు బంగారు భవితనిద్దామని సమగ్ర శిశు సేవా పథకం అధికారిణి జి సునంద తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వేపినాపిలో స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సౌజన్య, ఎంఎస్‌కె అనీత, ఆశా వర్కర్లు, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు(విద్యఆంధ్రజ్యోతి): నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభు త్వ బాలికల జూనియర్ కళాశాలలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, న్యూరో ఫిజీషియన్ ఏ హేమలతారెడ్డి, నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరు అన్నపూర్ణ, ఆర్‌ఐవో, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాసులు, నెరసం సభ్యులు అరుణ, షేక్ నజ్మా బేగం, ఏ భారతి, అధ్యాపకులు కరుణకుమారి, పూర్ణ, సుధ తదితరులు పాల్గొన్నారు.

● కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. క్రాంతినగర్‌లోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బాలికల హక్కులపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడతామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వెంకటాచలం : కసుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కసుమూరు ప్రాథమిక పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు, రాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వీ.విజయలక్ష్మి, కసు ఫూరు, కసుమూరు పాఠశాలల హెచ్‌ఎంలు మురళీమోహన్, రవిచంద్ర, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

● విడవలూరు : బాల్యవివాహాలను చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సుమిత్ర, రమణిలు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలు బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే పార్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణకుమారి, లక్ష్మి, పద్మ, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : బాలికల వికాసానికి ఎన్‌డీఏ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రధా మోదీ బేటీ బచావో - బేటీ పడావో కార్యక్ర మం ద్వారా బాలికల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం నాయకులు లెక్కల రాజశేఖర్, హర్షవర్ధన్, కోసూరు సుధీర్, పాల్గొన్నారు.

ఆర్టీసీ సిటీ బస్సులు నడపండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆర్టీసీ సిటీ బస్సులు నడపాలని నగరానికి చెందిన బీ సాగర్ అనే వ్యక్తి ఆర్టీసీ అధికారులను కోరారు. జిల్లా స్థాయిలో ప్రతిపాదనలు పంపామని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి బస్సులను ఏర్పాటు చేస్తామని నెల్లూరు-2 డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ తెలిపారు. 2వ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం సాయంత్రం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగ్గురు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు తెలిపారు.

డ్రైవర్ల ర్యాలీ

డ్రైవర్స్‌డే సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు-1 డిపో మేనేజర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి వీఆర్‌సీ వరకు డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, భద్రత సిబ్బంది పాల్గొన్నారు.

కామాక్షితాయికి పల్లకీ సేవ

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో శుక్రవారం రాత్రి కామాక్షితాయికి పల్లకీసేవ వైభవంగా జరిగింది. అలాగే అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిగింది. ఉదయం ఆదిదంపతులకు నిత్య కల్యాణం వైభవంగా జరిగింది.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



టీపీగూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పొదలకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిపర్తిలో పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ హనీఫ్‌తో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల ఏటా చాలా మంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు.

నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, దీని వల్ల ప్రమాద సమయంలో రక్షణ పొందవచ్చని పోలీసులు తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు పోలీసు స్టేషన్ల ఆధ్వర్యంలో స్వీయ రక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు.

● నవాబుపేట పోలీసు స్టేషన్ నుంచి ఆత్మకూరు బస్టాండు వరకు స్థానిక ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషా ఆధ్వర్యంలో ఎస్‌ఐ రెహమాన్, సిబ్బంది, స్థానికులు హెల్మెట్లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు.

● నగరంలోని రామలింగాపురం ఫ్లైవోవర్ బ్రిడ్జిపై నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు నార్త్, సౌత్ ట్రాఫిక్ పోలీసులు బైక్‌లపై హెల్మెట్ ర్యాలీ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని ఎస్‌ఐ వీరేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం తోటపల్లిగూడూరులో స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలతో కలిసి హెల్మెట్ ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

'శుభమస్తు'లో రక్తదానం

నెల్లూరు (వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వెంకట రమణయ్య 10వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆ మాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో సిబ్బంది రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి సిబ్బం ది రక్తం సేకరించారు. 'శుభమస్తు' ఏడు బ్రాంచ్‌లలో రక్తదానం జరిగి నట్లు నిర్వాహకులు తెలియచేశారు. మాల్ యజమానులు బయ్యా శ్రీనివా సులు, బయ్యా వెంకట రవికుమార్, కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషాద్రి సుధీర్, కార్యదర్శి మెంటా, కోశాధికారి మోహన్‌కృష్ణ పాల్గొన్నారు. అనంతరం బయ్యా రవికుమార్‌ను సత్కరించారు.



బయ్యా రవికుమార్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ప్రసన్న, కాకాణిలకు అభివృద్ధి కనపడలేదా..?

కొడవలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక ఎక్కడ తమ ఉనికి కోల్పోతామోనన్న భయంతో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని నియోజకవర్గ టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద టీడీపీ పరిశీలకుడు ముంగమూరు శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేంలో నాయకులు బెజవాడ వంశీకృష్ణరెడ్డి, కేతు వెంకటరమణారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, జెట్టి రాజ్‌గోపాల్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డిలు మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గంలో తమ అనుచరులతో రూ.కోట్లు విలువ చేసే భూములు, గ్రావెల్, ఇసుక, లే అవుట్ వద్ద మామూళ్లు దోచుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియోజకవర్గంలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. గతంలో వీరి చేసిన అరాచకాలకు ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పారన్నారు. ఈ సమావేశం నియోజకవర్గంలో నాయకులు చెక్క మదన్, చెముకుల శ్రీనివాసులుయాదవ్, పాశం శ్రీహరిరెడ్డి, జొన్న శివకుమార్, కరకటి మల్లికార్జున, హరికృష్ణ, శేషయ్య, తువ్వర ప్రవీణ్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు(వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ 50వ వార్షికోత్సవం, అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు షిండే పుట్టిన రోజును పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని నోవా బ్లడ్‌బ్యాంకులో ఈ శిబిరం జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరు ప్రదీప్ మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి నరేంద్రబాబు, నాయకులు దుగ్గిపాటి అశోక్, ప్రసాద్, అనిల్, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దోమలపై దండయాత్ర

నెల్లూరు(వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోటమిట్ట ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన దోమలపై దండయాత్ర కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పాల్గొన్నారు. దోమల వల్ల కలిగే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పూలకుండీలు, టైర్లు, కొబ్బరి బొండాలలో నిల్వఉన్న నీటిని పారబోయాలని సూచించారు. లార్వా దశలోనే దోమలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కో ఆర్డినేటర్ తిరుపతయ్య, మలేరియా సూపర్వైజర్ శ్రీధర్, రమ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పాడి రైతులకు మందుల పంపిణీ

వెంకటాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదగాలిలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 467 పశువులకు, 124 దూడలకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ముఖ్యఅతిథిగా సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు దువ్వూరు లక్ష్మమ్మ, టీడీపీ నేత హిమలాకర్‌రెడ్డి, ఏరియా పశువైద్యా సహాయ సంచాలకులు డాక్టర్ గురువారెడ్డి, పూడిపర్తి పశువైద్యాధికారి డాక్టర్ యూన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులు

● మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కొడవలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట‌ను కొనసాగించాలి, సర్పంచు చెక్‌పవర్ రద్దును క్యాన్సిల్ చేయాలంటూ కొడవలూరు ప్రధాన కూడలి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈవీఎంలు అడ్డుపెట్టుకుని గెలిచిన అధికార పార్టీకి అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామ్మూర్తి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ మరమ్మతులు, రోడ్డు వెడల్పు చేసిన కారణంగా రామలింగాపురం, రామ్మూర్తి నగర్, గచ్చుకాలువ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. కోటమిట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. అలాగే డైకస్ రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ, పతేఖాన్‌పేట ఫీడర్‌లో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపికలు

నెల్లూరు(క్రైం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులకు నగరం లోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి మాట్లాడుతూ పోలీసు సిబ్బందితో కలిసి సేవలు అందించిన వారిని అభినందించారు.

వీఆర్వో అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు (హరనాధపురం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వీఆర్వో అసోసియేషన్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్ శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. రీసర్వే సంపూర్ణంగా పూర్తి కావడానికి వీఆర్వోలు కృషి చేయాలని సూచించారు. వీఆర్వోల గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 ఉన్నతీకరణ జాబితాను తయారు చేయాలని డీఆర్‌వో ఉదయ భాస్కర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీఆర్వో అసోసి యేషన్ అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి దారా రమణయ్య, జగదీష్, శ్రీనివాసులురెడ్డి, మునిబాబు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, వీఆర్వో సంఘం నాయకులు

పిత్తాశయంలో 500లకుపైగా రాళ్లు

నెల్లూరు (వైద్యం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బృందావనంలో ఉన్న దీప్తి నర్సింగ్ హోంలో ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ లోక్‌నాథం మాట్లాడారు. తోటపల్లిగూడూరు మండలం పొట్లపూడి గ్రామానికి చెందిన కామేశ్వరి(45) రెండేళ్లుగా పొట్టనొప్పితో బాధపడుతుండేదని చెప్పారు. అనేక ఆసుపత్రులకు వెళ్లినా గాస్ట్రిక్ ట్రబుల్‌గా వైద్యులు నిర్ధారించి మందులు రాసారన్నారు. అయితే నొప్పి ఎంతటికీ తగ్గక పోవటంతో దీప్తి నర్సింగ్ హోంకు వచ్చిందని, అప్పటికే ప్రాణాపా య స్థితిలో ఉన్న ఆమె వైద్య పరీక్షలు చేయగా పిత్తాశ యంలో 500కుపైగా రాళ్లు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. లాప్రో స్కోపి ద్వారా చాకచక్యంగా చిన్నపాటి రాళ్లను తొలగించామన్నారు. దీంతో ఆ మహిళ కోలుకుంటోందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రతీది గ్యాస్ట్రిక్ ట్రబుల్‌గా భావించవద్దని ప్రజలకు ఆయన సూచించారు.




మాట్లాడుతున్న లోకనాథం

రామకృష్ణారెడ్డికి ఘన నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జన వరి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ దివంగత నాయకుడు హెచ్ రామకృష్ణారెడ్డి 26వ వర్ధంతి సంద ర్భంగా నగరంలోని బీజేపీ కార్యాల యంలో ఉన్న ఆయన విగ్రహానికి శుక్రవారం బీజేపీ నాయకులు పూ లమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ముత్తుకూరు బస్టాండు, వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ, ముసునూరు సుబ్బారావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

కోవూరు : స్థానిక ఓ కల్యాణ మండపంలో శుక్రవారం రీజనల్ సెక్రటరీ కొండపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆ యూనియన్ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కరాది అజిత్ కుమార్‌రెడ్డి, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా మావిళ్ల కృష్ణ, డివిజనల్ సెక్రటరీగా సింగంశెట్టి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బండి వివేకానందరెడ్డి, ట్రెజరర్‌గా జక్కుల మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని గూడూరు డివిజన్ నాయకులు శివశంకర్, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు అభినందించారు. అనంతరం విద్యుత్తుశాఖ కార్యాలయంలో సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు.



న్యూఢిల్లీలో వేడుకలకు బిందుసేద్యం రైతులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 24(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఆదివారం జరిగే గణతంత్ర దిన వేడుకలకు ప్రత్యేక అతిథులుగా పుత్తూరు మండలం తొర్రూరు గ్రామానికి చెందిన ఇద్దరు బిందు సేద్యం రైతులు ఎంపికైనట్లు జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి సతీష్ తెలిపారు. బిందు సేద్యంతో పూల తోటలు పెంచుతూ అధిక దిగుబడి సాధించిన గజేంద్ర నాయుడు, ఉషారాణి దంపతులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.



జిల్లా పర్యాటక అభివృద్ధికి ఏడంతస్తుల సాక్ష్యం

అవకాశాలు మెండుగా ఉన్నా జిల్లా పర్యాటక అభివృద్ధి మందగమనంలోనే సాగుతోంది. అందుకు సాక్ష్యమే ఈ భవనం. అలిపిరి దగ్గర, రుయా ఆసుపత్రికి ఎదురుగా అద్భుతమైన హిల్‌వ్యూతో పర్యాటకుల వసతి కోసం 2016లో నిర్మించిన భవనం ఇది. ఎకరా స్థలంలో రూ. 25కోట్ల వ్యయంతో 103గదులున్న ఏడంతస్తుల భవనంలో . 80మంది సీటింగ్ కెపాసిటీతో రెస్టారెంట్ ఏర్పాటు కూడా ఉంది. స్టార్ హోటల్‌గా దీనిని వినియోగంలోకి తీసుకురావాలన్నది ఆలోచన. వ్యవస్థల్లోని వైకల్యం వల్ల అర్ధంతరంగా ఇలా ఆగిపోయింది. పూర్తి చేయడానికి మరో రూ11కోట్లు అవసరమని అంచనా వేసి 2023లో ఒక సంస్థకు కేటాయించారు. నెలకు కోటి రూపాయల అద్దె పర్యాటక శాఖకు చెల్లించేలా ఒప్పందంతో నిర్మాణం పూర్తి చేయాలి. ఎందు చేతనో తాపీ సిమెంటు కూడా భవనం గోడలమీద వేయలేదు. మందుబాబులు, మాదకద్రవ్యాలు సేవించేవారికి ఆశ్రయంగా మారింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

మూడు రంగుల కలెక్టరేట్



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివర్ణ విద్యుత్ కాంతులతో కలెక్టరేట్ ముస్తాబైంది. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ నలువైపులా మూడు రంగుల కాంతులతో విరాజిల్లుతోంది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

■ నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

పర్యాటక ఖజానా

ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి విడిపోయి ఏర్పడిన తిరుపతి జిల్లా పర్యాటక కేంద్రాలకు ఖజానా. తిరుమలకు దేశం నలుమూలల నుంచీ వస్తున్న యాత్రికులను ఆకర్షించగలిగితే ఆధ్యాత్మిక క్షేత్రాలు, ఆహ్లాద ప్రదేశాలు కాసుల వాన కురిపిస్తాయి. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకుని నిధులు సమకూర్చుకుంటేనే ఇది సాధ్యం.

- 6లో







అడవిలో నుంచి పాపవినాశనం దారిలోకి వస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్ ఫొటోలు)

ఏనుగు భేల్

ఎటు నుంచి ఏ ఏనుగు వస్తుందో.. అని భక్తులతో పాటు టీటీడీ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఘాట్‌తో పాటు తిరుమల పరిసర ప్రాంతాల్లోనూ ఏనుగుల జాడ కనిపిస్తూనే ఉంది. దీంతో మళ్లీ గజరాజుల భయం మొదలైంది. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినా, ముందు జాగ్రత్తగా జనసంచారాల్లో ఏనుగులు రాకుండా వైల్డ్‌లైఫ్ అధికారులతో టీటీడీ చర్యలు మొదలు పెట్టింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

- తరచూ తిరుమల ఘాట్, పార్వేటమండపం వద్ద ప్రత్యక్షం
- భయాందోళనకు గురిచేస్తున్న గజరాజులు
- జనావాసాల్లోకి రాకుండా టీటీడీ చర్యలు



మొదటి ఘాట్‌లోకి వస్తున్న ఏనుగు (ఫైల్ ఫొటో)

చిరుతల సంచారం కాస్త తగ్గిందనుకునే లోపే తాజాగా మళ్లీ ఏనుగుల సంచారం అధికారులను కలవర పెడుతోంది. మొదటి ఘాట్‌లో గురువారం ఏనుగులు కనిపించడంతో భక్తులు, టీటీడీ ఆందోళన చెందుతోంది. ప్రస్తుతం తిరుమలకు సమీపంలో 12 ఏనుగులతో ఓ గుంపు, 13 ఏనుగులతో మరో గుంపు సంచరిస్తున్నాయి. ఆహారం, నీటి కోసం ప్రధాన ఏనుగు రూట్‌మ్యాప్ ఎను సిద్ధం చేసి ముందుకు సాగుతుందని, దానికి అనుగుణంగా మిగిలినవి అనుసరిస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇలా.. పార్వేటమండపం, గోగర్భండ్యాం, శ్రీగంధం వనం మీదుగా కాకులకొండ వెనుకనుంచి మామండూరుకు వెళ్లి.. తిరిగి అవ్వాచారి కోన లోయ మీదుగా ఘాట్‌రోడ్డుకు సమీపానికి వస్తున్నాయని అధికారులు గుర్తించారు. ఏనుగుల కదలికలతో భక్తులు హడలిపోతున్న క్రమంలో అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. తిరుమల జనసంచారంలోకి, ఘాట్‌రోడ్లు, కాలినడక మార్గాల్లోకి ఏనుగులు రాకుండా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇందులో భాగంగానే వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధికారులను టీటీడీ సంప్రదించింది. శుక్రవారం వైల్డ్‌లైఫ్ అధికారుల బృందం పార్వేటమండపం పరిసర ప్రాంతాలతో పాటు ఘాట్‌రోడ్లను పరిశీలించింది. అడవి నుంచి జనావాసాల్లోకి ఏనుగులు రాకుండా రైల్వే పట్టాల తరహాలో ఇనుప రాడ్లతో రైలింగ్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని టీటీడీ వ్యక్తపరిచినట్లు తెలిసింది. ఐదారు అడుగుల ఎత్తులో రెండు వరసలతో రైలింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ఏనుగులు తిరుమల పరిసర ప్రాంతాల్లోకి రావనే అభిప్రాయాన్ని టీటీడీ ఫారెస్ట్ అధికారులు వ్యక్తపరిచారు. దీనిపై వైల్డ్‌లైఫ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 29వ తేదీ వైల్డ్‌లైఫ్ ప్రధాన సైంటిస్ట్ తిరుమలకు రానున్నారు. వారంరోజుల్లో ఈ అంశంపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటి వరకు భక్తులపై ఎలాంటి దాడులు చేయకపోయినప్పటికీ వీడియోలు, ఫొటోలు తీస్తున్నవారిని ఏనుగులు తరిమిన ఘటనలు ఉన్నాయి. ఈక్రమంలో భవిష్యత్తులో ఏనుగుల ద్వారా భక్తులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకూడదనే ఉద్దేశ్యంతో టీటీడీ ఏనుగుల సంచారాన్ని జనవాసాల్లో నివారించేదిశగా అడుగులేస్తోంది.

ఏనుగులను తరమడం శ్రేయస్కరం కాదు

ఏనుగులు ఆహారం, నీటి కోసం ఏడాది పాటు ఓ నిర్దేశిత బాటను ముందుగానే ఎంచుకుంటాయి. దానికి అనుగుణంగానే తరచూ కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. నిజానికి వీటి ద్వారా ఎలాంటి ప్రమాదం ఉండదు. ఒకవేళ ఏనుగులు కనిపిస్తే దూరంగా వెళ్లిపోవాలి. వాటిని తరమడం, కర్రలతో వాటి వద్దకు వెళ్లి శబ్ధాలు చేయడం శ్రేయస్కరం కాదు. పిల్లలతో ఉన్న ఏనుగులు మరింత ప్రమాదం. ఎక్కడైనా భక్తులు, స్థానికులు, ఉద్యోగులకు ఏనుగులు కనిపిస్తే సమీపంలో భద్రత, ఫారెస్ట్ అధికారులకు సమాచారమివ్వాలి. మేము వాటిని దట్టమైన అడవిలోకి పంపేలా చర్యలు తీసుకుంటాం. జనసంచారంలోకి ఏనుగులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచిస్తున్నాం.

- శ్రీనివాసులు, డీఎఫ్‌వో, టీటీడీ ఫారెస్ట్

పదేళ్లుగా తరచూ సంచారం

తిరుమల పరిసర ప్రాంతాల్లో పదేళ్లుగా ఏనుగుల గుంపులు తరచూ కనిపిస్తున్నాయి. ప్రధానంగా చూస్తే..

- 2015 మార్చిలో ఓ ఏనుగుల గుంపు పార్వేటమండపం వద్దనున్న శ్రీగంధ వనంలో బీభత్సం సృష్టించాయి. ఇనుప కంచె, అక్కడక్కడా నిర్మించిన రాతిగోడను ధ్వంసంచేసి, అనేక చెట్లను నేలకూల్చాయి.
- 2016లోనూ పార్వేటమండపం వద్దనున్న ఓ నీటి గుంట వద్దకు వచ్చిన ఏనుగులు.. రోడ్డుపక్కనున్న చెట్లను కూల్చాయి. ఆ సమయంలో ఫారెస్ట్ అధికారులు పాపవినాశన మార్గాన్ని మూడురోజుల పాటు మూసివేశారు.
- 2018లో శ్రీవారి పాదాల మార్గంలోని మిర్యాలతోట వద్ద ఏనుగుల గుంపు బీభత్సం చేశాయి.
- ఇక, కొవిడ్ సమయంలో ఏనుగుల సంచారం మరింతగా పెరిగిపోయింది. తరచూ తిరుమల సమీపానికి వచ్చి వెళ్లడం సాధారణమైపోయింది. శ్రీవారిపాదాల మార్గంతో పాటు పార్వేటమండపం, గోగర్భం డ్యాం వద్ద ఏనుగులు ఏదో ఒక సందర్భంలో కనిపిస్తూనే ఉన్నాయి. ఇందులో ప్రధానంగా 2022 మార్చి, మే, 2024 ఫిబ్రవరి నెలల్లో పార్వేటమండపం వద్ద కంచె, చెట్లు ధ్వంసం చేసిన ఘటనలున్నాయి. 2024 ఏప్రిల్ నెలలో శిలాతోరణం వద్ద బీభత్సం చేశాయి.
- తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్‌లోని ఏనుగుల ఆర్చ్ నుంచి ఏడోమైలు మధ్యలో కూడా ఏనుగుల సంచారం సాధారణమైపోయింది. 2020 జూన్ 5న, 2022 ఫిబ్రవరి, మార్చిలో ఘాట్‌రోడ్డులో, అదే నెలలో పాపవినాశనం మార్గంలో కనిపించాయి. 2023 ఏప్రిల్15న, జూన్ 27న కూడా దాదాపు 12 ఏనుగులు ఘాట్‌రోడ్డు సమీపానికి వచ్చి భక్తులను హడలెత్తించాయి.
- గతేడాదిలో రెండు సార్లు, తాజాగా గురువారం మరోసారి ఘాట్‌రోడ్డులోని ఏనుగుల ఆర్చ్ వద్ద కనిపించాయి. కొన్ని సందర్భాల్లో రోడ్డు దాటుతున్నాయి. ఈ ఘటనలు భక్తులను కలవరపరుస్తున్నాయి.

గంజాయి, బహిరంగ మద్యపాన నిషేధం

ఇవీ తొలి ప్రాధాన్యాలు

- ప్రజలకు పోలీసులు జవాబుదారీతనంగా ఉండేలా చర్యలు
- రథసప్తమికి తొక్కిసలాటకు వీల్లేకుండా ఏర్పాట్లు
- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన రాజు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): గంజాయి నివారణ, బహిరంగ మద్యపాన నిషేధం.. తన తొలి ప్రాధాన్యాలని నూతన ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. ఇంకా ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో ప్రశాంత వాతావరణం కల్పించే పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తానన్నారు. నూతన ఎస్పీగా నియమితులైన హర్షవర్ధనరాజు శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణా, బహిరంగ మద్యపానం నిషేధంపై ఉక్కుపాదం మోపి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక బృందాలు నిరంతరం గస్తీ నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ఇప్పటికే జిల్లాలో ఉన్న బృందాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. తిరుపతి ప్రజలకు మళ్లీ సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, డీజీపీ ద్వారకా తిరుమలరావు తనపై ఉంచిన గురుతర బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చుతానన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అటువంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటానని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. పోలీసుల్లో ప్రజల పట్ల జవాబుదారీ తనం పెంచడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో అహర్నిశలు పనిచేసి ప్రజల్లో పోలీసులంటే ఒక నమ్మకం, స్నేహపూర్వక వాతావరణం తీసుకొస్తానన్నారు. సాయంత్రం పూట ప్రతి పోలీసు రోడ్లపై కనపడే విధంగా విజుబుల్ పోలీసింగ్ తీసుకొస్తానన్నారు. తిరుపతిలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటో డ్రైవర్లు, వివిధ వాహనాల యజమానులు, నిర్వాహకులతో సమావేశమై చర్యలు చేపడతామన్నారు. కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని ఫ్రీ ట్రాఫిక్ ఏర్పాటు చేయడానికి ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాత ఘటనలు పునరావృతం కాకుండా తిరుమలలో వచ్చే నెల 4న జరగనున్న రథ సప్తమికి అవసరమైన ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసుల్లో మనోధైర్యం తీసుకు వచ్చి వారిలో పనిచేసే వాతావరణం కల్పిస్తామని చెప్పారు. అనంతరం అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు. కాగా, ఉదయం తిరుమల శ్రీవారిని ఎస్పీ హర్షవర్ధనరాజు దర్శించుకున్నారు.

కోడిబొచ్చు కథకు ఫుల్‌స్టాప్ పెట్టండి

- అధిష్ఠానం నుంచి అడుగుతున్నారు
- 'వేస్ట్' వాహనాలను సీజ్ చేయండి
- కార్పొరేషన్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి
- పోలీస్, మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కోడిబొచ్చు కథకు ఫుల్‌స్టాప్ పెట్టాలని, దీనికోసం పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికల ముందు తిరుపతిలో జరుగుతున్న కోడిబొచ్చు మాఫియాపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రముఖంగా మాట్లాడడంతో సర్వత్రా చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చినా ఈ మాఫియా కొనసాగడంపై 'ఆంధ్రజ్యోతి'లో 'కోడిబొచ్చు కథ ముగియలేదు', కోడిబొచ్చు కథలో కొత్త ట్విస్ట్' శీర్షికన ప్రచురితమైన కథనాలు జనసేన అధిష్ఠానం దృష్టికి వెళ్లాయి. పార్టీ ఆదేశాలతో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అప్రమత్తమయ్యారు. నగర పరిధిలోని 5 మంది సీఐలు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌తో సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టిలో కోడిబొచ్చు వ్యవహారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కూడా చికెన్ వేస్ట్ అక్రమ రవాణా సాగడం ఏమిటని ప్రశ్నించారు. 'ఆంధ్రజ్యోతిలో కథనాలు మీరు చూస్తున్నారు కదా. పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. ఇకపై ఇలాంటివి జరగకుండా చూడండి' అని ఆదేశించారు. ఇటీవల తిరుపతి నుంచి చికెన్ వేస్ట్‌ను నెల్లూరుకు తరలిస్తూ పట్టుకున్న 6 మినీట్రక్కులను ఎందుకు విడిచిపెట్టారని పోలీసులను అడిగినట్టు తెలిసింది. దీనివెనుక ఎంతటి వారున్నా వదిలి పెట్టొద్దని ఎమ్మెల్యే చెప్పినట్టు సమాచారం. చికెన్ వేస్ట్‌తో పాటు కుళ్లిన ఆహార పదార్థాలు, చెడిపోయిన గుడ్లు, చర్మాలు తదితరాలను చేపల పెంపకంలో వినియోగించడానికి వీల్లేదని, ఈ వ్యర్థాల రవాణానూ నిషేధిస్తూ 2016లో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఆయన పోలీసులకు వివరించినట్టు సమాచారం. చికెన్ వేస్ట్ తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేస్తే నియంత్రణ సులభమవుతుందన్నారు. ఇన్సినిరేటర్ ద్వారా చికెన్ వేస్ట్‌ను నిర్వీర్యం చేసేందుకు యంత్రాన్ని సిద్ధం చేస్తున్నామని కార్పొరేషన్ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

ఎంతటివారైనా చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే



కోడిబొచ్చు మాఫియా వ్యవహారం తమ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లిందని, దీనిపై అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అందుకనే పోలీసులు, మున్సిపల్ అధికారులతో తాను సమావేశమైనట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కోడి బొచ్చు మాఫియాలో ఎంతటి వారున్నా, చివరకు కూటమి నాయకుల జోక్యమున్నా కేసు పెట్టమని ఆదేశాలు ఇచ్చానన్నారు.

స్వర్ణముఖిలోకి వెళ్లకుండా..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏర్పేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మోదుగులపాళెం స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమార్కులు వేసిన రాచబాటను శుక్రవారం అధికారులు తొలగించారు. వాహనాలు వెళ్లకుండా కందకాలు తవ్వించారు. 'ఇసుక అక్రమ రవాణాకు రాచబాట' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన కథనంపై శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాలతో తహసీల్దారు భార్గవి తన సిబ్బందితో కందకాలు తవ్వించారు. ఇసుక అక్రమార్కులు వెళ్లకుండా చర్యలు చేపట్టడంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌ఐ సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారి మునస్వామి తదితరులున్నారు.



కందకాలు తవ్వుతున్న రెవెన్యూ అధికారులు

మల్లిమడుగులో ట్రెంచ్‌ల ఏర్పాటు



రేణిగుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరు నుంచి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మేరకు శుక్రవారం ట్రెంచ్‌లను ఏర్పాటు చేశారు. మల్లిమడుగు రిజర్వాయరులో మట్టి తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు సురేష్ బాబు ఆదేశాలతో వీఆర్వో బాబు, రెవెన్యూ సిబ్బంది ట్రెంచ్‌ల ఏర్పాటు పనులు చేపట్టారు. రిజర్వాయరులోకి వెళ్లే అన్నిమార్గాల్లో వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

కల్లుగీత ఉపకులాలకు మద్యం దుకాణాల కేటాయింపు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల్లోని ఉప కులాల వారికి 23 మద్యం దుకాణాలను శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్ లాటరీ తీసి కేటాయించారు. ఉప కులాల ప్రాతిపదికన దుకాణాలు కేటాయించడంతో మొత్తం ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు విజయశేఖర్, జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి, అసిస్టెంట్ ఈఎస్ వాసుదేవ చౌదరి నేతృత్వంలో గీత కార్మికులకు ఉపకులాల ప్రాతిపదికన దుకాణాలు కేటాయించామని జేసీ తెలిపారు. ఈడిగలకు తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు పట్టణాలు, ఓజిలి, తొట్టంబేడు, కేవీబీపురం, ఎర్రావారిపాలెం, డక్కిలి, నారాయణవనం, శ్రీకాళహస్తి, బాలాయపల్లి, తిరుపతి రూరల్, తడ, వరదయ్యపాలెం మండలాలు, గౌడ్ కులానికి దొరవారిసత్రం, నాగలాపురం, చిట్టమూరు మండలాలు, గౌడ కులానికి పుత్తూరు, నాయుడుపేట, గౌండ్ల కులానికి సంబంధించి వాకాడు, పెళ్లకూరు, సూళ్లూరుపేట పట్టణంలో మద్యం దుకాణాలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి చంద్రశేఖర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.



గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయిస్తున్న జేసీ



తిరుపతిలో 'అప్పరెల్' మాల్

● దావోస్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసిన ఆ సంస్థ చైర్మన్ నీలేష్ వేద్

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గ్లోబల్ ఫ్యాషన్ సంస్థ అప్పరెల్ గ్రూప్ తిరుపతిలో లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ మాల్‌ను ఏర్పాటుచేసేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. ఆమేరకు దావోస్‌లో మంత్రి నారా లోకేశ్‌ను అప్పరెల్ గ్రూప్ చైర్మన్ నీలేష్ వేద్ కలిసి చర్చించారు. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి తమ ఇష్టదైవమని ఎప్పటినుంచో తిరుపతిలో ఫ్యాషన్ మాల్ ఏర్పాటుచేయాలని అనుకున్నట్టు చెప్పినట్టు సమాచారం. 24వేలమందికి పైగా ఉద్యోగులు, 85 అంతర్జాతీయ బ్రాండ్లతో 14 దేశాలలో 2300 మాల్స్ ఉన్నాయి. ఉత్తరాదికి చెందిన నీలేష్ తన అప్పరాల్ మాల్‌ను తిరుపతిలో ఏర్పాటుచేస్తే వెయ్యిమందికిపైగా ఉపాధి అవకాశాలతో పాటు నగరానికి సరికొత్త బ్రాండింగ్ వస్తుందని ఫ్యాషన్ ప్రేమికులు చెబుతున్నారు. త్వరలోనే ఆ గ్రూప్ ప్రతినిధులు తిరుపతికి వచ్చి పరిశీలించనున్నట్టు తెలిసింది.


గంజాయి నిందితులకు రిమాండ్

పిచ్చాటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 400 గ్రాముల గంజాయి పట్టివేత కేసులో ఐదుగురు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. నిందితుల్లో వెంగళత్తూరుకు చెందిన ఎస్.లావెన్స్(21) హానస్ట్‌రాజ్(22), తిరువళ్లూరు జిల్లా అమ్మంబాక తాలూకా సీతంజేరి గ్రామానికి చెందిన ఈ.సతీష్‌కుమార్ (20), పెన్నలూరుపేటకు చెందిన ఈ.శరత్ (20), ఊత్తుకోట తాలూకా వెల్లతుకోట్టై గ్రామం అరిసానా కాలనీకి చెందిన ఎం.చిన్నమణి (20) ఉన్నారు.

రుయా అభివృద్ధి కమిటీలో మరో ఇద్దరు సభ్యులు

తిరుపతి(వైద్యం), 24(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా కరణం సందీప్, ఆటో డ్రైవరు ఐఎస్ ఖాజా మోహిద్దీన్‌లను నియమిస్తూ కలెక్టరు వెంకటేశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కరణం సందీప్ టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

శ్రీహరి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.95 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 56,225

తలనీలాలు సమర్పించినవారు: 19,588

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

మన జిల్లా పర్యాటక ఖజానా





పులికాట్‌లో పడవ విహారం

పులికాట్: జిల్లాకు అద్భుతమైన పర్యాటక వరం పులికాట్. 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల ఈ ఉప్పునీటి సరస్సు మీద పర్యాట దృష్టి తగినంతగా పెట్టనేలేదు. తడలో నిర్మించిన పర్యాటక వసతి భవనాలను కనీసం వినియోగంలోకి తీసుకురాలేదు. కేరళ తరహా బ్యాక్‌వాటర్స్ లా పులికాట్‌ను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి పరిచే అవకాశం చాలా ఉంది.



బీవీపాలెం వద్ద ఇప్పటికీ వినియోగంలోకి రాని రిసార్ట్స్



నేలపట్టు: నేలపట్టుకు, పులికాట్‌కు లక్షల సంఖ్యలో వలస పక్షులు వస్తుంటాయి. పక్షి ప్రేమికులకు అద్భుతమైన ప్రదేశాలు ఇవి. పులికాట్‌లో పక్షుల పండుగ సమయంలో తప్ప పర్యాటకులకు పడవలు అందుబాటులో ఉండవు. నేలపట్టులో పక్షులతోపాటే సందర్శకుల విడిదికి భద్రమైన ఏర్పాట్లు లేవు. ఇక్కడ ఒక రోజంతా కుటుంబాలు ఆహ్లాదంగా గడిపేలా ఏర్పాట్లు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయగలిగితే ఈ కేంద్రాలు ఆదాయ వనరులుగా మారుతాయి.

తిరుపతి అర్బన్, వాకాడు, తడ- ఆంధ్రజ్యోతి

పర్యాటక ఆదాయం పెంచుకోవడానికి అత్యధిక అవకాశాలున్న జిల్లా తిరుపతి. ఆధ్యాత్మిక పర్యాటకం, ఆహ్లాదకర పర్యాటకం, ఎకోటూరిజం కేంద్రాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించుకోగలిగితే భవిష్యత్తు బంగారంగా మారుతుంది. ఆధ్యాత్మిక, ఆహ్లాద క్షేత్రాలు లెక్కకు మిక్కిలిగా జిల్లాలో ఉన్నాయి. విశాలమైన ఆరు వరుసల జాతీయ రహదారిని కలిపేలా వీటికి మంచి రోడ్లు వేయగలిగితే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా ఇవి మారుతాయి. తిరుమలకు వచ్చే యాత్రీకులను వీటికి మళ్లించేలా టూరిస్ట్ హబ్‌గా తిరుపతి జిల్లాను మలచుకేనే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



గుడిమల్లంలోని పురాతన శివలింగం

ఆధ్యాత్మిక క్షేత్రాలు: తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వచ్చే యాత్రికులు అదనంగా ఉండి దర్శించుకోగల అద్భుత క్షేత్రాలు జిల్లాలో ఉన్నాయి. క్రీస్తు.పూర్వం నాటి గుడిమల్లం, అద్భుత శిల్పకళాశోభితమైన శ్రీకాళహస్తి, చోళులు నిర్మించిన మన్నారుపోలూరు ఆలయం, మాంబట్టు శివుడి గుడి, పులికాట్ తీరాన పంట్రంగం శివాలయం, నారాయణవనం వంటి క్షేత్రాల ప్రాశస్త్యం తెలిపే సమాచారం ప్రచారంలోకి తీసుకురావడం, ఆ క్షేత్రాలకు వెళ్లే దారులను మెరుగు పరచడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్యాకేజీ టూర్లు నిర్వహించవచ్చు.




మన్నారుపోలూరులోని అరుదైన గరుత్మంతుడి విగ్రహం



పంట్రంగేశ్వరుడి గుడి




మాంబట్టులోని కాశీవిశ్వేశ్వరాలయం



కొండూరుపాలెం బీచ్


ఇన్ని బీచ్‌లున్నాయి: జిల్లాలో 36 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తూపిలిపాళెం తప్ప ఇతర బీచ్‌లు ప్రజలకు తెలియవు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలో అనేక ప్రాంతాలను బీచ్‌లుగా అభివృద్ధి పరచే అవకాశం ఉంది. శ్రీనివాససత్రం, కొండూరుపాళెం, వాడపాళెం, పూడిరాయదొరువు వంటి చోట్ల అద్భుతమైన బీచ్‌లను అభివృద్ధి పరచవచ్చు. ఈ ప్రదేశాలకు వెళ్లేందుకు తగిన రోడ్లు వేయడం ముఖ్యం. బకింగ్‌హాం కెనాల్ సముద్రంలో కలిసే మొగదారి ప్రాంతంలో అనేక బుల్లి దీవులుంటాయి. చెట్లు దట్టంగా ఉన్నవీ, ఒట్టి ఇసుక దిబ్బలూ ఉంటాయి. సందర్శకులు ఆహ్లాదంగా రోజంతా గడపదగ్గ ప్రదేశాలుగా వీటిని రూపొందించవచ్చు. ఇందువల్ల ఆ ప్రాంత మత్స్యకారుల కుటుంబాలకూ ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయి. పులికాట్‌లోనూ, సముద్రంలోనూ దొరికే రొయ్యలూ, చేపల వంటకాలను ప్రచారం చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చు.



ట్రెక్కింగ్

శేషాచలం కొండల్లోని అడవులూ, జలపాతాలూ ప్రకృతిప్రియులను అలరిస్తాయి. ఇక్కడి తీర్థాల సందర్శనం గొప్ప అనుభూతిని ఇస్తుంది. దాదాపు పది ట్రెక్కింగ్ టీంలు ఈ కొండల్లోకి తరచూ వెళ్లి వస్తుంటాయి. వీటన్నింటినీ ఒక గొడుగు కిందకు తీసుకువచ్చి, భద్రత కల్పించి మార్గదర్శనం చేస్తే జిల్లా పర్యాటక పటంలో అదనపు వనరుగా అమరుతుంది.

ఎకో టూరిజం: ప్రకృతిలో మమేకం అయ్యేలా చేసే తలకోన, మామండూరు మన జిల్లాలోనే ఉన్నాయి. చిక్కని అడవులు, జలపాతాలు, గలగలపారే వంకలు, చెంగున దూకే జింకలు ఉండే ఈ ప్రాంతాలు ప్రస్తుతం ఏటో టూరిస్టు కేంద్రాలుగా ఉన్నాయి. ఇక్కడ వసతులు మరింత మెరుగు పరచిపి పిల్లల ఆహ్లాదానికి అనువైన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. భద్రతకు ఢోకా లేని కేంద్రాలుగా వీటి గురించిన ప్రచారం కూడా విస్తృతంగా జరగాలి. కైలాసకోన, బత్తినయ్యకోన, ఉబ్బలమడుగు, సిద్ధులయ్యకోన వంటి జలపాతాలు కూడా జిల్లాలో చాలానే ఉన్నాయి. పర్యాటక ప్రదేశాలుగా వీటి అభివృద్ధికి తగిన ప్రణాళికలు అవసరం.



తలకోన జలపాత సౌందర్యం



మామండూరు అడవి అందం

హస్తకళల జిల్లా: హస్తకళలకు కూడా తిరుపతి జిల్లా కాణాచి. శ్రీకాళహస్తి కలంకారీకి ప్రపంచ గుర్తింపు ఉంది. ఫ్యాషన్ రంగంలో ఇప్పుడు కలంకారీ కీలకంగా మారింది. చేనేతకూ జిల్లా ప్రసిద్ధి. పట్టు, కాటన్ చీరలు, లుంగీలు, టవళ్లు, డ్రెస్ మెటీరియల్స్ నేసే ఊళ్లు అనేకం జిల్లాలో ఉన్నాయి. వెంకటగిరి చీరలకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. నారాయణవనం, గొల్లపల్లి, మన్నారుపోలూరు, కారిపాకం లలో నేసే వస్త్రాలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని ప్రఖ్యాత షోరూంల్లో అమ్ముతున్నారు. వీటికి జిల్లాలో ప్రత్యేక అమ్మకపు కేంద్రాలు ఏర్పాటు చేయగలిగితే పర్యాటక ఆదాయంతో పాటూ నేత కార్మికులకూ ఉపయోగం కలుగుతుంది. మాధవమాల కొయ్యబొమ్మలకు నిలయం. శ్రీకాళహస్తిలో, తిరుచానూరులో ఎన్నో రకాల కొయ్యబొమ్మలు తయారు చేస్తారు. రాతి శిల్పాలు చేసే కేంద్రాలు కూడా తిరుపతిలో ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటక ఆదాయ వనరులుగా మార్చుకునే ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది.



మాధవమాల కొయ్యబొమ్మ



కాళహస్తి కలంకారీసొగసు

'ఐఐటీ తిరుత్సవ్'కు సిద్ధం

● ఫిబ్రవరి 21 నుంచి

టెక్నో కల్చరల్ ఫెస్ట్‌కు 3డీ మ్యాప్ విడుదల



ఏర్పేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ తిరుత్సవ్-2025 వేడుకలకు సిద్ధమైంది. ఫిబ్రవరి 21 నుంచి 23వ తేదీ వరకు ఐఐటీ ప్రాంగణంలో మూడు రోజుల పాటు ఈ వార్షిక టెక్నో కల్చరల్ ఫెస్ట్ జరగనుంది. ఈ వేడుకల్లో పలు ఈవెంట్లు, సాంకేతిక పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వర్క్‌షాపులు, ఎగ్జిబిషన్లు ఉండనున్నాయి. ఆకట్టుకునే సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులు పోటీపడనున్నారు. తిరుత్సవ్ సన్నాహాల్లో భాగంగా ఐఐటీ కళాశాల క్యాంపస్‌లో ఇంటరాక్టివ్ నేపథ్య 3డీ మ్యాప్‌ను విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఈవెంట్‌కు హాజరయ్యే వారికి ఆకర్షణీయమైన సాధనంగా 3డీ క్యాంపు మ్యాప్ ఉంటుందని విద్యార్థులు భావిస్తున్నారు.ఈ వేడుకలను అట్టహాసంగా జరపడానికి విద్యార్థులు కమిటీలు ఏర్పాటు చేసుకుని ముందస్తుగా 3డీ మ్యాప్‌ను మీడియాకు రిలీజ్ చేశారు.

కల్కి ట్రస్ట్ భూ ఆక్రమణలపై ఎన్జీటీలో కేసు పెట్టా: నార్నె

తిరుపతి(ఆటోనగర్), జనవరి24(ఆంధ్రజ్యోతి): కల్కి ట్రస్ట్ భూ ఆక్రమణలు, అక్రమాలపై మద్రాసు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు నమోదు చేశామని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీఎన్ కండ్రిగ మండలం కల్లివెట్టు సమీపం సర్వే నెంబరు 295లోని అంజూరు సమీపంలోని అటవీశాఖలో 20.75 ఎకరాల డీప్ ఫారెస్ట్ భూమిని కల్కి ట్రస్ట్ నిర్వాహకులు ఆక్రమించి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారన్నరు. దీనిపై అటవీ, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అందుకని కల్కి ఆశ్రమ నిర్వాహకులు, అటవీ శాఖ అధికారిని బాధ్యులుగా చేసి నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో కేసు వేశామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ ఏఆర్ రెడ్డి, బాధితుడు మునిచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎఫ్‌ఏలు, ఒక టీఏ సస్పెన్షన్

● జరిమానా, రికవరీ వెంటనే చెల్లిస్తేనే ఉద్యోగం ● పీడీ శ్రీనివాసప్రసాద్

కేవీబీపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను పీడీ శ్రీనివాసప్రసాద్ సస్పెండ్ చేశారు. అలాగే జరిమానా, రికవరీ వెంటనే చెల్లిస్తేనే ఉద్యోగాలు ఉంటాయని అవకతవకలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. కేవీబీపురంలో 2023 ఏప్రిల్ నుంచి 24 ఏప్రిల్ వరకు ఉపాధి హామీలో జరిగిన రూ.10,95,77,000 విలువైన పనులపై శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 38 పంచాయతీల్లో జరిగిన పనుల రికార్డులను ఆయన పరిశీలించారు. ఎక్కువ అవినీతికి పాల్పడిన మఠం ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, రంగయ్యగుంట ఫీల్డ్‌అసిస్టెంట్ అంకయ్యను, టీఏ వెంకటయ్యను సస్పెండ్ చేశారు. విధుల్లో అలసత్వం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లుకు, ఏపీవోకు రూ.1,40,500 జరిమానా విధించారు. అలాగే అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది నుంచి రూ.8,41,900 రికవరీ చేయాలని ఎంపీడీవో, ఏపీడీని ఆదేశించారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేనిచోట్ల పదిరోజుల్లో ఆయా రిజర్వేషన్ల ఆధారంగా వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. మరణించిన వారి పేరుతోనూ బిల్లులు చెల్లించారనే అభియోగాలపై విచారణ చేయాలని ఏపీడీ ప్రేమ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాణి, ఏపీవో, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తును రాజకీయం చేయొద్దు

తిరుపతి(వైద్యం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిజానిజాలు తెలుసుకోకుండా చిన్నారుల భవిష్యత్తును రాజకీయం చేయడం సబబు కాదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. నగరిలో లైగింక వేధింపులకు గురై స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఆయన శుక్రవారం పరామర్శించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. మానవీయ కోణంలో చూడాల్సిన ఈ విషయాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. చిన్నారిపై అత్యాచారం జరిగిందా లేదా అనే విషయాన్ని వైద్య పరీక్షల అనంతరమే వెల్లడిస్తామని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

పశు ఆరోగ్య శిబిరాల్లో 10,186 మంది రైతులకు లబ్ధి

శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న పశువైద్య శిబిరాల్లో తొలి నాలుగు రోజుల్లోనే 10,186మంది పాడి రైతులకు ప్రయోజనం కలిగిందని తిరుపతి డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఉమామహేశ్వరి తెలిపారు. శ్రీకాళహస్తి మండలంకాపుగున్నేరి, తొట్టంబేడు మండలం చియ్యవరంలో పశువైద్య శిబిరాలను శుక్రవారం ఆమె సందర్శించారు. శ్రీకాళహస్తి పశుసంవర్ధక శాఖ ఏడీ ఎన్వీ శ్రీకాంత్‌బాబు, పశువైద్యాధికారులు ఉష, రవీంద్రవర్మ పాల్గొన్నారు. కాపుగున్నేరిలో జరిగిన పశువైద్యశిబిరంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు పాడి రైతులకు మందులను అందజేశారు.

పర్యావరణ నియమాలు కచ్చితంగా పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణయ్య, సెల్వం, రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ నియమ నిబంధనలను పరిశ్రమలు కచ్చితంగా పాటించాలని తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సీ.సెల్వం కోరారు.స్థిరమైన వ్యర్థాల నిర్వహణ, వనరుల సామర్థ్యం ప్రాధాన్యతను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) శ్రీసిటీతో కలిసి శుక్రవారం 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సర్క్యులర్ ఎకానమీ' అనే అంశంపై శ్రీసిటీలో సదస్సు నిర్వహించింది. పరిశ్రమల ప్రతినిధులు, అటవీ అధికారులు, పర్యావరణ నిపుణులు పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలు వాటి వ్యర్థాలను సమీప అటవీ ప్రాంతాలు, నీటి వనరులలో వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమలు సుస్థిర పర్యావరణ వ్యవస్థలుగా ఎలా రూపాంతరం చెందుతాయి అనే దానికి శ్రీసిటీ చక్కని ఉదాహరణగా ఏపీపీసీబీ చైర్మన్ పీ.కృష్ణయ్య పేర్కొన్నారు. మిచిగాన్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సుధాకర్ జీ.రెడ్డి తన వర్చువల్ ప్రసంగంలో సుస్థిరత, వ్యర్థాల నిర్వహణకు సంబంధించి అమలులో ఉన్న ప్రపంచ అత్యుత్తమ పద్ధతులను వివరించారు. శ్రీసిటీ పరిశ్రమలకు చెందిన 100కు పైగా హెచ్ఆర్‌లు, పలు విభాగాల మేనేజర్లు పాల్గొన్నారు.

శ్మశానం చేరాలంటే నది దాటాల్సిందే..!



ఏర్పేడు మండలం ఎండీపుత్తూరులో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల కోసం శ్మశానం చేరాలంటే నది దాటాల్సిందే. గ్రామం పక్కనే ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది ఒడ్డున దహన సంస్కారాలు నిర్వహించేవారు. ఇటీవల వర్షాలకు ప్రవాహం అధికమైంది. నది దాటడానికి అనుకూలంగా లేదు. ఈ క్రమంలో గురువారం చింత పుట్టాలమ్మ(98) మృతిచెందగా.. శుక్రవారం ఉదయం మెడలోతు నీటిలో మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. మిగతా బంధువులంతా అవతలి ఒడ్డుకు వెళ్లలేక ఇవతలే ఉండిపోయారు. అధికారులు స్పందించి తమ గ్రామ శ్మశాన సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

\- ఏర్పేడు

తొక్కిసలాటలో మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం



తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన మల్లిక కుటుంబానికి రూ.25 లక్షల పరిహారాన్ని టీటీడీ బోర్డు సభ్యులు శుక్రవారం అందజేశారు. పరిహారం చెక్‌ను మల్లిక కుమారుడు రమేష్‌కు టీటీడీ సభ్యులు నరేష్‌కుమార్, రామ్మూర్తి, శాంతారాం, కృష్ణమూర్తి అందజేశారు. టీటీడీ బోర్డు తీర్మానం ప్రకారం పరిహారం చెల్లించగా, బాధితుల కుటుంబంలో ఒకరికి టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చేందుకు వారి కుటుంబ సభ్యుల వివరాలను బోర్డు సభ్యుల బృందం తీసుకుంది.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహారావు, పక్కన ఆర్ఐ రాజగోపాల్, టీడీపీ నేత సుధాకర్ రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే ద్వారా ప్రజలు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నరసింహారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మంగానెల్లూరు పంచాయతీ పరిధిలోని సుద్దమడుగు తాగేలిలో రీ సర్వేలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సుద్దమడుగు తాగేలి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకొని రీ సర్వే చేపట్టామన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూమితో పాటు దేవదాయ, రైతుల భూములను పకడ్బందీగా రీ సర్వే చేస్తామన్నారు. రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే సర్వే సిబ్బంది స్వీకరించి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, సర్వేయర్ బాలాజి, వీఆర్వో వెంకటరమణ, టీడీపీ నాయకుడు దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ఓజిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు పద్మావతి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలో ఏనుగువాడలో నాలుగు రోజులుగా భూముల రీ సర్వే కొనసాగుతోందన్నారు. రైతులు తమ భూముల హద్దులు, కొలతలు, ఇతర సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మట్టం శ్రావణి

గూడూరు, చిల్లకూరు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలించాలని టీడీపీ తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మెహబూబీ, సూపర్‌వైజర్ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే చిల్లకూరు మండలంలోని కడివేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవంనిర్వహించారు. బాలికల రక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో మెహబూబీ, సూపర్‌వైజర్ రేణుకమ్మ, సిబ్బంది పద్మావతి, సుగుణ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిచారు. ప్రజేంద్రరెడ్డి, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాదినోత్సవంలో అజయ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, పీటీఏ సెక్రటరీ మునిగిరీష్, ప్రిన్సిపాల్ ఓంనమశివాయ

గూడూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అంతర్జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు అజయ్ కుమార్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గూడూరు సమీపంలోని శారదానగర్‌లో ఉన్న లిటిల్ ఏజెంల్స్ పాఠశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదర్కొనే శక్తిని కలిగి వుంటారన్నారు. అంతకుముందు ఆయన జాతీయ జెండాను ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ పీటీఏ సెక్రటరీ కొణిదల మనిగిరీష్, ప్రిన్సిపాల్ ఓం నమఃశివాయం, హెచ్‌ఎం సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, భోజన పొట్లాల పంపిణీ

గూడూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో మంజుల, వెంకటసుబ్బయ్య సహకారంతో పేదలకు దుప్పట్లు, భోజనం పొట్లాలను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, మురళీ నాయుడు, రాము, సురేష్‌రెడ్డి, కుమార్ నాయుడు, ప్రభాకర్, శివకుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, నాగరాజు, కృష్ణారెడ్డి, మునిప్రసాద్, శ్రీధర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

సూళ్లూరుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి వెంకటశర్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వి.రాజా శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అల్లు శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాలు

గూడూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండో పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు, డ్రైవర్లకు, ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా, అజాగ్రత్తగా వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీవాణి, డాక్టర్ విజయ మహేష్, పీరకుమార్, లక్ష్మీహిమబిందు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

గ్యాస్ లీకై మంటలు

ముగ్గురికి గాయాలు

వెంకటగిరి టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేటలో నివాసం ఉంటున్న అనుసూయమ్మ ఇంట్లోని సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్ఎఫ్‌వో నారాయణ వివరాల మేరకు.. బంగారుపేటలో నివాసం ఉంటున్న అనుసూయమ్మ శుక్రవారం ఇంట్లో స్టౌ వెలిగించింది. వెంటనే పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో అనుసూయమ్మ, ఆమె భర్త వెంకటేశ్వర్లు, కుమారుడు ఈశ్వరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లక్ష వరకు ఆస్తి నష్టం ఉంటుందని తెలిపారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

నాయుడుపేట టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కత్తితో దాడి చేసిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. మండలంలోని అత్తలపాళెం గ్రామానికి చెందిన నాగరాజుపై అతని అన్న కుమారుడు సుధాకర్ కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

బెల్టు దుకాణంపై దాడులు

కోట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో మద్యం బెల్టు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానికంగా ఉన్న పాకనాటి జనార్దన్ 15 మద్యం బాటిళ్లను బెల్టు దుకాణంలో విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకొన్నారు. అతనిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు.



మెటల్ వేస్టును రీసైక్లింగ్ చేస్తున్న శ్రామికులు - నిల్వ చేసిన ఇనుప ముక్కలు కలిసిన దుమ్ము

గుట్టుగా మెటల్ వేస్ట్ రీసైక్లింగ్

గుట్టలుగుట్టలుగా దుమ్ము, ఇనుప ధూళి నిల్వ ● పంటలు దెబ్బతింటున్నాయని రైతుల ఆందోళన

ఓజిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం సగుటూరు పంచాయతీలోని వీర్లగునుపాడు అటవీ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మెటల్ వేస్టును రీసైక్లింగ్ చేస్తున్నారు. మండలంలోని పెద్ద పరియ వద్ద ఉన్న ఓ కర్మాగారం నుంచి వెలువడుతున్న మెటల్ వేస్టు(మట్టి, దుమ్ము కలిసిన ఇనుప ముక్కలు)ను ఇక్కడకు తరలించి రీసైక్లింగ్ చేగిస్తున్నారు. మెటల్ వేస్టును ఇక్కడ ప్రాసస్ చేసి, అందులో ఉండే ఇనుప ముక్కలను తిరిగి కర్మాగారానికి పంపుతారు. రీసైక్లింగ్ సమయంలో వెలువడుతున్న దుమ్ము, మట్టిని అక్కడే గుట్టలు గుట్టలుగా పోస్తున్నారు. దీంతో ఇక్కడి పరిసర ప్రాంతాలకు దుమ్ము, దూళి వ్యాపించి పర్యావరణానికి ముప్పుగా మారిందని సమీపంలోని ఆరిమేనిపాడు గ్రామస్తులు అంటున్నారు. మెటల్ వేస్టు ధూళి కారణంగా నీళ్ల కలుషితమవుతున్నాయని, ఆ నీటిని తాగుతున్న పశువులకు ప్రాణాంతకమవుతోందని, పొలాల్లో పంటలు కూడా దెబ్బతింటున్నాయని ఆరిమేనిపాడు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రీసైక్లింగ్ యూనిట్ రెండేళ్ల కొనసాగుతోందని, దుమ్ము, ధూళి గాల్లో కలిసిపోకుండా పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు.

పంచాయతీ అనుమతి ఇవ్వలేదు

మెటల్ వేస్టు రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి పంచాయతీ అధికారులు అనుమతి ఇవ్వలేదని ఈవోపీఆర్డీ రేణుక తెలిపారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర పనులకు వినియోగించుకునే ప్రక్రియలో భాగంగా కన్వర్షన్ కూడా ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ సర్వీసు ఏ ప్రాతిపదికన ఇచ్చారోనని పంచాయతీ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచి వసంతకుమారి మాట్లాడుతూ ఈ ప్రాంతలోని క్వారీ గుంతలను మట్టితో పూడ్చి వేస్తామని నిర్వాహకులు చెప్పారని, అందుకు మాత్రమే తాము అనధికారికంగా అంగీకారం తెలిపామన్నారు.

రూ.960 కోట్లతో సాగరమాల పనులు: కలెక్టర్



సమావేశంలో మాట్లాతున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

కోట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.960 కోట్లతో 5 ప్యాకేజీలుగా సాగరమాల రోడ్డు పనులు జరుగుతున్నాయని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కోట మండలం చంద్రశేఖరపురంలోని ఆప్కో కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో భూ సేకరణ, రైతుల నష్టపరిహారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగరమాల రోడ్డు పనులు 10శాతం పూర్తి కావడం జరిగినట్లు తెలిపారు. వర్షాలు, భూ వివాదాల వల్ల కొంత జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం సాగరమాల రోడ్డుకు సేకరించిన భూముల్లో రైతులు వరి సాగు చేసి ఉన్నారని, వారికి నష్టపరిహారం చెల్లించి పంటలను తొలగించి పనులు ప్రారంభిస్తామన్నారు. అదే విధంగా సిక్స్ లేన్ జాతీయ రహదారి, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు సమనయంతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, కోట, చిల్లకూరు, ఓజిలి, నాయుడుపేట మండలాల తహసీల్దార్లు జయజయరావు, శ్రీనివాసులు, పద్మావతి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓజిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించిన ధృవ పత్రాలను ఎస్ఐ స్వప్న పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల, వాహనాలను పరిమిత వేగంతో నడపాలని సూచించారు.

నేడు రక్తదాన శిబిరం

నాయుడుపేట టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవేమ డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు టీఎంఆర్ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి తెలిపారు. యువకులు, విద్యార్థులు రక్తదానం చేయాలని కోరారు.

మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన

చిల్లకూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలోని రైతులకు శుక్రవారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ రైతుల అభ్యున్నతి కోసం కోసం అనే పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో కార్తీక్, వెంకటేశ్వర్లు, సెల్వీరాజ్, సఫీ, షాహల్, హమీద్, అరుణ్, శ్రీనివాసులు, వెంకయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గూడూరు జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. జేవీవీ ఉపాధ్యక్షుడు చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, రామ్మోహన్, కళ్యాణి, సుబ్బారావు, ప్రభాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణుదుర్గా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



వెంకటగిరి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేటలో ఉన్న విష్ణుదుర్గా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వివేకానందా యువ సైన్యం ఆధ్వర్యంలో ఏపీపీ ప్రకృతి కుమార్ అన్నదానం చేశారు.

గ్రామదేవతకు పొంగళ్లు

బాలాయపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయంపు గ్రామంలో గ్రామదేవత మొహిలేరమ్మకు శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సామూహిక పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బియ్యం, నిత్యావసరాల అందజేత



సెల్వీకి బియ్యం, నిత్యవసర సరుకులు అందజేస్తున్న విద్యార్థులు

నాయుడుపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తమ పాకెట్ మనీతో ఓ పేద కుటుంబానికి సాయం అందించారు. నాయుడుపేట రాజీవ్‌గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న ఆవుల సెల్వీ, రమేష్ దంపతులు నిరుపేదలు. రమేష్ రాడ్ బెండర్‌గా పనిచేస్తూ ప్రమాదానికి గురై వెన్నెముఖ దెబ్బతినడంతో పదేళ్లుగా పనిచేయని దుస్థితి. సెల్వీ కూలి పనులు చేసుకుంటూ తన ఐదుగురు బిడ్డలను, అనారోగ్యంతో చనిపోయిన చెల్లెల ఇద్దరు బిడ్డలను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పి చదివిస్తోంది. వీరి పేదరికాన్ని గుర్తించిన పభుత్వ కళాశాల విద్యార్థులు సెల్వీ కుటుంబానికి బియ్యం, నిత్యవసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సుబ్బు, జాన్సన్, సాయినవీన్, బాలు, ప్రదీప్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ: పాశిం



బాలాజీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జీలగ బాలాజీ గుండెపోటుతో మృతి చెందడంతో ఎమ్మెల్యే, నాయకులు నివాళులర్పించారు. బాలాజీ కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరుపున రూ.25వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అహర్నిశలు పార్టీకోసం పని చేసిన బాలాజీ మృతిచెందడం బాధాకరమన్నారు. అతని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అలాగే మట్టం శ్రావణి, ఎరమాపు హేమకుమార్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణయ్య, శ్యామల, అంకమ్మ తదితరులు బాలాజీ మృతదేహానికి నివాళులర్పించారు.

ఎన్‌జీవో సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన ఎన్‌జీవో సంఘ నాయకులు

వాకాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం వాకాడు తాలూకా యూనిట్ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా తిరుమూరు కృష్ణయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వేము దినకర్‌బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా దుగ్గిన అఖిల్‌కుమార్, జనరల్ సెక్రటరీగా యనమల శంకరయ్య, జాయింట్ సెక్రటరీగా ఎంబేటి హరిబాబు, కె.రాము, ఎం.వెంకటరమణ, ట్రజరర్‌గా చిట్టమ్మ, ఉమెన్ జాయింట్ సెక్రటరీగా మస్తానమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జనార్దన్, గిరిబాబు వ్యవహరించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు దుస్తుల వితరణ

కోట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5 అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. వాకాడుకు చెందిన నజీర్‌బాషా దాతృత్వం, షిరిడీసాయి అక్షయసేవా సమితి సౌజన్యంతో అందజేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని 100 మంది చిన్నారులకు ఆ సంస్థ అధ్యక్షుడు అల్లం రమణయ్య, సీనియర్ టీడీపీ నాయకుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, సీడీపీవో మునికుమారి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కృష్ణమ్మ, ఆయా అంగన్‌వాడీ వర్కర్లు హెల్పర్లు ఉన్నారు.

జాతీయ బాలికల దినోత్సవం

కోట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. సీడీపీవో మునికుమారి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కృష్ణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు మమత, సుందరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

పెళ్లకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి కోరారు. శుక్రవారం నెల్లూరులో నెలవలను కలిసి పంచాయతీలో సమస్యలను వివరించారు. ముఖ్యంగా చావాలి చెక్‌పోస్టు నుంచి శిరసనంబేడు మీదుగా వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉందని, మరమ్మతులను చేపట్టాలని కోరారు.

తీరప్రాంత గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించండి



ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులతో కలెక్టర్ వెంకటేశ్వర్

నాయుడుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. శుక్రవారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులు, టీడీపీ నాయకులు కలెక్టర్‌తో మాట్లాడారు. పక్షుల పండుగ సందర్భంగా అవసరమైన మేరకు రూ.25 లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్లు నిర్మించామని కలెక్టర్ తెలిపారు. అలాగే తీరప్రాంతాల్లో అవసరమైన మేర రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఇతర ప్రజాప్రతినిధులు, పోలీసులు, అన్ని అధికారుల సహకారంతో పక్షుల పండుగను విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరవపెరిమిడి చంద్రారెడ్డి, పల్లమాల రామిరెడ్డి, పేరం శ్రీరామ్‌ప్రసాద్, దార్ల రాజేంద్ర, ఆకుతోట రమేష్, మిడతా సూరి, పరసా వెంకటరమణయ్య, బిరదవాడ నారాయణ, మొండెం బాబు, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



కరస్పాండెంట్‌లతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని డీఎస్పీ చెంచుబాబు సూచించారు. డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పట్టణం, మండలంలో ఉన్న ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల కరస్పాండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాలు అమర్చుకోవడం ద్వారా భద్రతా పరంగా రక్షణ ఉంటుందన్నారు. అలాగే పాఠశాలకు విద్యార్థులను తీసుకొచ్చి, తీసుకెళ్లే సమయంలో బస్సులో ఓవర్‌లోడ్ లేకుండా చూసుకోవాలన్నారు. భద్రతాపరంగా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, కళాశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు భద్రత కల్పించాలి

గూడూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారస్థులకు భద్రత కల్పించాలని ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు వంద మందికి పైగా చిరువ్యాపారులు ప్రభుత్వాస్పత్రి రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు, చిన్నచిన్న గుడారాలు వేసుకుని వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, ట్రాఫిక్ ఆంక్షలతో పోలీసులు వారిని వేధించడం సబబుకాదన్నారు. పట్టణంలో ఎన్నో అక్రమ కట్టడాలు ఉండగా, వాటి జోలికి పోకుండా పేదలపై కక్షసాధింపు చర్య లేమిటని ప్రశ్నించారు. అధికారులు పునరాలోచించి చిరువ్యాపారులకు ఇబ్బందులను సృష్టించడం మానుకుని, వారి భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎంబేటి చంద్రయ్య, నారాయణ, సీపీఐ నేతలు ప్రభాకర్, శశికుమార్, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

అనుకూలమైన స్థలంలో బస్టాండ్ నిర్మించండి



తహసీల్దార్ ద్వారకనాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పెళ్లకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండేలా 71వ జాతీయ రహదారి పక్కన బస్టాండ్‌ను నిర్మించాలని కార్మిక సంఘం జిల్లా నేత చేపల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తాళ్వాయిపాడు, పెన్నేపల్లి గ్రామస్తులు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తాళ్వాయిపాడు గ్రామానికి కిలో మీటరు దూరంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టడంతో అసౌకర్యంగా ఉంటుందన్నారు. తాళ్వాయిపాడు - పెన్నేపల్లి గ్రామాల మధ్యలో బస్టాండ్ నిర్మాణం చేపడితే రెండు గ్రామాలతో పాటు కానూరు, కానూరురాజుపాలెం, కారుమంచివారి కండ్రిగ గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తహసీల్దారుకు వివరించారు. కార్యక్రమంలో గంగాబత్తిన శ్రీనివాసులు, భాస్కర్, మధు, పెంచలయ్య, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.